వార్త

25 జూన్, 2023

ఆదివారం



# రామ రామ! ఇదేం ప్రేమ!!




# కీలక పాత్రలో శ్రియారెడ్డి!



పవన్ కళ్యాణ్ కథా నాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో 'ఓజీ' సినిమా రూపొందుతోంది. డీవీవీ దానయ్య భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగు జరుగుతున్న ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన కథానాయికగా ప్రియాంక అరుళ్‌మోహన్ అలరించనుంది.

ఈ సినిమాలో కీలకమైన ఓ పాత్ర కోసం శ్రియారెడ్డిని తీసుకున్నారు. శ్రియారెడ్డి గతంలో కొన్ని తమిళ సినిమాల్లో నటించింది. 'సలార్' సినిమాలోను ఒక ముఖ్యమైన పాత్ర చేస్తోంది ఈమె. ఈ సినిమా కథ 1950 కాలంలో ముంబై నేపథ్యంలో కొనసాగుతుందని, ఆ కాలానికి చెందిన గ్యాంగ్‌స్టర్ పవన్ కనిపించనున్నట్లు సమాచారం.

**తారాతీరం**



# గోపీచంద్ కొత్త సినిమా 'భీమా'

టాలీవుడ్ కథానాయకుడు గోపీచంద్ హీరోగా, కన్నడ దర్శకుడు హర్ష దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కన్నడలో బ్లాక్‌బస్టర్‌లను అందించిన హర్ష ఈ భారీ బడ్జెట్ చిత్రంతో టాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తున్నాడు. ఈ చిత్రానికి 'భీమా' అనే పేరు పెట్టారు. పోలీస్ ఆఫీసర్‌గా గోపీచంద్‌కి ఇది రెండో సినిమా. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ ఈ మాస్ ఎంటర్టైనర్‌ను నిర్మిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలోని ఇతర నటీనటుల వివరాలు త్వరలో వెల్లడి కానున్నట్లు సమాచారం.

ఆదివారం వార్త
25 జూన్, 2023

## మంచి ముత్యాలు

మరణం, జీవితం అన్నవి ఈ ప్రపంచపు ఒడ్డుపైన అవిశ్రాంతంగా పోరాడుతుంటాయి.


- నార్టన్

## విషయ విశేషం


ఏదీ వృథా కాదు.... 4
'సంఘీ'భావం....5
మహిళాభ్యుదయంతోనే దేశాభివృద్ధి
కవర్ స్టోరీ..6
రామ రామ!
ఇదేం ప్రేమ!!
అమెరికాలో ఉన్నత విద్య..11
ఈవారం కవిత్వం..12
గతం విలువ
కనిపెట్టారు.....14
కథ.. 20
రారండోయ్ వేడుక చూద్దాం!
యుక్తవయస్సులో ఇలా....24
సాహిత్యం..25
అడవికొలను పార్వతి అభ్యుదయ ఆత్మకథ
బిళ్వణి....30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### లిక్విడ్ చెట్టు



సెర్బియా రాజధాని బెల్‌గ్రేడ్‌లో బొగ్గుగనులే ప్రధాన జీవనాధారం. కానీ, గనుల వల్ల ఐరోపాలోనే అత్యంత కలుషిత నగరంగా ఇది పేరుమోసింది. ఆ సమస్యని తగ్గిద్దామని చెట్లు పెంచాలనుకుంటే ఖాళీ స్థలమే లేకపోయింది. అతికష్టంపైన స్థలాన్ని వెతికిపట్టి మొక్కలు పెంచినా కాలుష్యానికి చచ్చిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే అక్కడ శాస్త్రవేత్తలు 'ద్రవరూప చెట్టు' యంత్రాన్ని రూపొందించారు. చూడటానికి అద్దాలతో చేసిన పెద్ద వాటర్ ట్యాంకర్‌లా ఉంటుందీ యంత్రం. అందులో ఆరువందల లీటర్ల నీళ్ల నింపి 'మైక్రో ఆల్గే' అనే నాచులాంటి పదార్థాన్ని వేస్తారు. ఆ నాచు చెట్లలాగే సూర్యరశ్మిని తీసుకుని పచ్చదనాన్ని పెంచుకుంటుంది. ఈ క్రమంలో కార్బన్ డైయాక్సైడ్‌ని పీల్చుకుని ఆక్సిజన్‌ని విడుదల చేస్తుంది. పైగా ఆ ప్రక్రియను అత్యంత వేగంగా చేస్తుంది. ఎంతగా అంటే ఈ ఒక్క యంత్రం పదేళ్ల నిండిన రెండు పెద్దచెట్లకి సమానమట. అందుకే వీటిని బెల్‌గ్రేడ్ నగరంలో పెట్టి..వాతావరణాన్ని స్వచ్ఛంగా మారుస్తున్నారు. అంతేకాదు, సౌరఫలకాల సాయంతో ఛార్జింగ్ పాయింట్‌గానూ పాదచారులు సేదతీరే వద్ద కుర్చీగానూ వాడుతున్నారు.

### జోక్స్..జోక్స్..

పేషెంట్: డాక్టర్‌గారు నాకు బాగా ఒత్తిడిగా ఉందండి..
డాక్టర్: గుడికి వెళ్లండి..
పేషెంట్: ప్రశాంతంగా దండం పెట్టుకోవాలా?
డాక్టర్: కాదు మెట్ల దగ్గర చెప్పులన్నింటినీ మిక్స్ చేసి ఓ పక్కన కూర్చో..అందరూ వచ్చి వాళ్ల చెప్పులు వెతుక్కుంటుంటే నీ ఒత్తిడి ఆటోమేటిక్‌గా తగ్గుతుంది..

...

ప్రియురాలు: రేపు నా పుట్టిన రోజు. ఉదయాన్నే గిఫ్టుగా నాకో రింగు ఇవ్వగలవా రవి?
ప్రియుడు: అలాగే దానిదేముంది, దేనికి చేయమంటావ్? సెల్‌కా? ల్యాండ్‌లైన్‌కా?
ప్రియురాలు: ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టింది..

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com




# ఏదీ వృధా కాదు..

**నేలమీద** సిగరెట్ పీక కనిపిస్తే పెద్దగా పట్టించుకోం. ఇంట్లో ఆహారం మిగిలితే చెత్తబుట్టలో పడేస్తాం. ఎక్కడైనా చికెన్ వ్యర్థాల్ని చూస్తే ముక్కు మూసుకుని వెళ్లిపోతాం. కానీ ఈ సంస్థలు వాటితోనే అద్భుతాలు చేస్తున్నారు. తమదైన ఆవిష్కరణలతో అబ్బురపరుస్తున్నాయి. కాకపోతే ఇవన్నీ కేవలం లాభాపేక్షతో చేసినవి కాదు..వాటి వెనక ఎంతో పర్యావరణ స్పృహ ఉంది.

సిగరెట్‌తో కేన్సర్ సహా పలు రోగాలు వస్తాయని మనకు తెలుసు. కానీ సిగరెట్ పీకవల్ల కూడా పర్యావరణానికి అంతేస్థాయి ప్రమాదం ఉందంటాడు నమన్ గుప్తా. సిగరెట్ పీకలో ఉండే దూదిలాంటి ప్లాస్టిక్ సెల్యులోజ్ అసిటేట్ భూమిలో కలిసిపోవడానికి కనీసం 14 ఏళ్లు పడుతుంది. అంతేకాదు, ప్రతి పీకా అరలీటరు భూగర్భ జలాన్ని కలుషితం చేస్తుంది. అందుకే ఈ సిగరెట్ పీకల్ని రీసైక్లింగ్ చేయడానికి సరికొత్త పద్ధతిని కనిపెట్టాడు నమన్ గుప్తా. ఇందుకోసం 'కోడ్ ఎఫర్ట్స్' అన్న స్టార్టప్‌ని ప్రారంభించాడు. ఆ సంస్థ ద్వారా దేశంలోని 250కి పైగా జిల్లాల నుంచి సుమారు రెండేవేల మంది కార్మికుల ద్వారా రోజూ వెయ్యి కిలోల సిగరెట్ పీకల్ని సేకరిస్తున్నారు. వాటి నుంచి పొగాకు, సన్నటి కాగితం, దూదిలాంటి ప్లాస్టిక్ (సెల్యూలోజ్ అసిటేట్)ను వేరు చేస్తున్నారు. పొగాకును సూక్ష్మజీవుల సాయంతో ఎరువుగా మారుస్తున్నారు. సన్నటి పేపర్‌ను ప్రత్యేక రసాయనాలతో పల్ప్‌గా మార్చి, 250 జీఎస్ఎం మందంలో పేపర్‌లని తయారుచేస్తున్నారు. వాటితో కవర్లూ, లెటర్‌హెడ్లూ వంటివి రూపొందిస్తున్నారు. చివరగా దూదిలాంటి ప్లాస్టిక్-సెల్యూలోజ్ అసిటేట్‌ని బొమ్మలు, తలగడలు, ఇతర అలంకరణ వస్తువుల్లో నింపే ప్లాస్టిక్ స్టఫింగ్‌గా వాడుతున్నారు. ఇప్పటిదాకా 250 కోట్ల సిగరెట్ పీకలను ఇలా ప్రాసెస్ చేసిందా సంస్థ. అంటే సుమారు 125 కోట్ల లీటర్ల నీరు కాలుష్యం కాకుండా అడ్డుకున్నారు.





# పాడైన ఆహారంతో..

అంకిత్ అలోక్ బగారియా, అభిగ్రావ్ ఇద్దరూ ఐఐటీ రూర్కీలో చదువుకున్నారు. చివరి ఏడాదప్పుడు వీళ్ల ఆహార వ్యర్థాలని సద్వినియోగం చేయడం గురించి ఆలోచించేవారట. ఎందుకంటే ప్రపంచంలో ఏటా 130కోట్ల టన్నుల ఆహారం వృధాగాపోతోందని విన్నారట. ఆ సమస్యకు పరిష్కారంగా మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి పేదలకు పంచేవాళ్ల గురించి వీళ్లు విని ఉన్నారు. కానీ ఇద్దరూ సైంటిస్టులు కదా! ఇంకొంచెం కొత్తగా ఆలోచించారు. వృధా ఆహారంతో ఓ జీవశాస్త్ర అద్భుతాన్ని ఆవిష్కరించారు. వీళ్ల కనిపెట్టిన పద్ధతి ప్రకారం వృధా ఆహారాన్ని సేకరించి, దాన్ని ప్రాసెస్ చేసి 'బ్లాక్ సోల్జర్ ఫ్లై' (బీఎస్ఎఫ్) అన్నకీటకానికి ఆహారంగా పెడతారు. లార్వా దశలో ఈ ఆహార వ్యర్థాల్ని తినడం మొదలుపెట్టే బీఎస్ఎఫ్ కీటకం ఎదిగేకొద్దీ దాన్ని ఎరువుగా మారుస్తుంది. అంతేకాదు, వాటిని తినడం ద్వారా తనలో అతిస్వచ్ఛమైన మాంసకృత్తుల్ని (ప్రొటీన్) తయారు చేసుకుంటుంది. ఆ ప్రొటీన్ చేపలూ, రొయ్యల సాగుకే కాదు..కోళ్లూ, పశువుల పెంపకంలోనూ బలవర్థక ఆహారంగా ఉపయోగపడుతుంది. ఆ ఎరువులూ, ప్రొటీన్ తయారీ కోసమే 'లూప్ వార్మ్' అన్న స్టార్టప్‌ని అందిస్తున్నారు. ఆహార వ్యర్థాల్ని తినే కీటకాల సాయంతో ఇలా ప్రొటీన్ తయారు చేయడం మనదేశానికి కొత్త! అందువల్లే, ఈ స్టార్టప్‌కి అటు కర్ణాటక, ఇటు కేంద్రప్రభుత్వాలు ఇటీవల కోటి రూపాయలు ఆర్థికసాయం చేశాయి.



## 'సంఘీ' భావం



# మహిళాభ్యుదయంతోనే దేశాభివృద్ధి

ఏదైనా ఒక ప్రాంతం, సమాజం, దేశం అభివృద్ధి చెందాలంటే ముందుగా మహిళలను చైతన్యవంతులు చేయాలన్నది పూర్వకాలం నుంచి ఉన్న నానుడి. మహిళలకు అన్ని రంగాల్లో భాగస్వాములు చేయడం ద్వారా దేశం సర్వతో ముఖాభివృద్ధిని సాధిస్తుందని అనేక సందర్భాలలో రుజువు అయ్యింది. ఆడపిల్ల విద్యను అభ్యసిస్తే సాధికారత వస్తుంది. ఆమె తన స్వంత నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుంది. తన కుటుంబం, పిల్లల జీవన ప్రమాణాలను పెంచేందుకు దోహదపడుతుంది. కనీసం 80 శాతం మంది మహిళలు విద్యను అభ్యసించి సమాజంలో ఎదుగుదలకు ప్రయత్నిస్తే 2025 నాటికి దేశ జీడీపీ 770 బిలియన్ డాలర్లకు జోడించే సామర్థ్యాన్ని కలుగుతుందని సర్వేలు చెబుతున్నాయి. మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న ముసుగులో ప్రభుత్వాలు ఉచితాలను ముందు పెట్టి వారి ఓట్లను రాబట్టే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నారు. చెట్టు శక్తివంతంగా ఉండాలంటే వేర్లకు నీరు పోయాలి. అంతేకాని చెట్టు ఆకులపై కాదన్నది ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి. బాలికలను చిన్నప్పటి నుంచే విద్య పట్ల ఆకర్షితులయ్యేలా ప్రయత్నించాలి. ప్రాథమిక దశలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. వారి తల్లిదండ్రులను విద్య ప్రాధాన్యతను తెలిసేలా చైతన్యవంతులు చేయాలి. చిన్నప్పటి నుంచే విజ్ఞానాన్ని సముపార్జించేలా బాలికలను తీర్చిదిద్దాలి. దేశవ్యాప్తంగా పాఠశాలలకు వెళ్లే బాలికల్లో ప్రతి పది మందిలో ఒకరు పాఠశాలల్లో సరైన మూత్రశాలలు లేవని నిలిచిపోతున్నారు. యుక్తవయస్సు వచ్చిన తరువాత బహిష్టు సందర్భంగా కలిగే ఇబ్బందుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు విద్యకు దూరం అవుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. యునిసెఫ్ సమర్పించిన గణాంకాల ప్రకారం 129 మిలియన్ల బాలికలు పాఠశాల విద్యకు దూరంగా ఉన్నారు. బోర్గెన్ ప్రాజెక్ట్ నివేదికల ప్రకారం 23 మిలియన్ల బాలికలు శానిటరీ నాప్‌కిన్స్ అందుబాటులో లేవని విద్యను మధ్యలోనే మానివేస్తున్నారు. నేషనల్ సర్వే ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం పురుషుల అక్షరాస్యత రేటు 84.7 శాతం ఉంటే 70.3 శాతం మంది స్త్రీలు మాత్రమే ఉన్నారు. విద్య పట్ల ఆసక్తి చూపే బాలికల సంఖ్య తక్కువగా ఉంటే డ్రాప్ అవుట్ల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. పాఠశాలల్లో బాలికలకు నెలకొన్న ప్రతికూల వాతావరణం, అనురక్షిత బహిరంగ ప్రదేశాలు, ఇళ్లలో పెద్దల అనాసక్తి వంటి అనేక కారణాలు స్త్రీ విద్యకు ఆటంకంగా మారుతున్నాయి. పురాతన కాలం నుంచి మహిళలకు చట్టపరమైన, సామాజిక, విద్యా హక్కులు కల్పిస్తూనే వచ్చినప్పటికీ పాత సాంప్రదాయాలకు సంబంధించిన కొన్ని అసమానతలు మహిళలకు గృహ అవసరాలకే పరిమితం చేయడం జరుగుతోంది. దీనితో ఆదిలోనే మహిళల అభ్యున్నతికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. మారుతున్న సమాజంలో డిజిటల్ అత్యంత కీలకంగా మారింది. డిజిటల్ నైపుణ్యాలతో మహిళలు, బాలికలను సన్నద్ధం చేయడం డిజిటల్‌గా అవగాహన ఉన్న పురుషులతో సమానంగా వారిని ఉంచడంలో సహాయపడుతుంది. విద్యను అభ్యసించే సమయంలో బాలికలు లింగవివక్షకు ఇప్పటికీ గురౌతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. బాలురకు ఉన్నంత స్వేచ్ఛ ఇటు పాఠశాలల్లోగాని, ఇళ్లలోగాని లేకపోవడం వల్ల ఆ ప్రభావం క్రమంగా బాలికల డ్రాప్ అవుట్‌కు దారి తీస్తోంది. సమాజం ఇంతగా అభివృద్ధి చెందినా ఇంజనీరింగ్‌లో కొన్ని కోర్సులకు మహిళలు దూరంగా ఉంటున్నారు. సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ మహిళలకు సరికాదన్న వాదన ఇప్పటికీ వినిపిస్తూనే ఉంది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చేరడానికి ఆసక్తి చూపుతున్న విద్యార్థినిలు ఇంజనీరింగ్‌లో ఇతర కోర్సులకు వెళ్లడానికి వెనుకడుగు వేస్తున్నారు. పైగా ఏ స్థాయిలో విద్యను అభ్యసించినా చివరకు క్లరికల్ స్థాయి ఉద్యోగాలు మాత్రమే మహిళలకు దక్కుతున్నాయన్నది కూడా వాస్తవం. చాలా తక్కువ మంది మహిళలు మాత్రమే కార్పొరేట్ సంస్థల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టుల్లో రాణిస్తున్నారు. వారిలో కూడా సగానికి పైగా మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. పురుష ఎగ్జిక్యూటివ్‌లకు ఎదురుకాని సమస్యలు మహిళలకు మాత్రమే చుట్టుముడుతుండటం లింగవివక్షకు కారణంగానే భావించాల్సి ఉంటుంది. మహిళలకు రిజర్వేషన్లు, ఉచితాలు వంటి వాటి కంటే వాస్తవంగా వారు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి సారిస్తే ఆశించిన పురోగతిని మహిళలు సాధించుకునే అవకాశం కలుగుతుంది. ఆడబిడ్డగా పుట్టినప్పటి నుంచి ఆమెకు ప్రత్యేక సమస్యలు వెంటాడుతూనే ఉంటాయి. ముందుగా మహిళలకు చదువుకునేందుకు అవకాశాలు మెరుగుపరిచి పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు ఆమె ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు దృష్టి సారిస్తే మహిళాభ్యుదయం దానికదే సాధ్యపడుతుంది.

మహిళల వేతనాల్లో అనేక సంస్థల్లో వ్యత్యాసం ఉంటోంది. అంతరిక్షంలో మహిళలు పయనించే స్థాయికి చేరుకున్నా భూమి మీద క్షేత్రస్థాయిలో వారిని కొన్ని ప్రత్యేక సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఈ సమస్య ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో ఉన్నా జనాభాపరంగా రెండో స్థానంలో ఉన్న భారతదేశంలో కొంత అధికంగానే ఉందని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ముందుగా లింగవివక్షతను నిర్మూలించి ఉచిత నిర్బంధ విద్యను అమలుచేస్తేనే ఆశించిన ఫలితాలు కొంతైనా బాలికలకు అందే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# రామ రామ! ఇదేం ప్రేమ!!

**కవర్ స్టోరీ**

**డాక్టర్ నీలం సంపత్**

**మానవ నాగరికత పరిణామ క్రమంలో ప్రేమ ఎంతో పవిత్రమైనదిగా గుర్తించబడడమే కాకుండా అజరామరమైనదిగా, అనిర్వచనీయమైనదిగా, ఎల్లలు లేని సముద్రం కన్నా ఎంతో లోతైనదిగా భావించ బడడం లోక విదితమే.**

స్వభావరీత్యా ప్రేమ ఎంతో నిష్కల్మషమైనది. నిస్వార్థమైనది, దానికి కుల, మత, వర్గ, వర్ణ వివక్షగానీ, ధనిక, పేద భేదాలుగానీ, ప్రాంతీయ విభేదాలుగానీ వుండవు. దాని నిండా జీవం వుంటుంది. అందుకే అది సజీవధారగా ప్రాణం పోసేదిగా శాశ్వతమైన గుర్తింపుతో వేలాది సంవత్సరాల నుండి తన అస్థిత్వాన్ని యథాతథంగా కాపాడుకుంటూ వర్తమానంలోకి ప్రవహిస్తుంది. అది ఎప్పుడూ త్యాగాన్నే కోరుకుంటుందనే మాటని నేటివరకు చరిత్ర చెబుతూ వస్తోంది. కానీ ఆధునిక సమాజంలో ప్రేమ పేరుతో జరుగుతున్న అనేక అమానవీయ ఘటనలను పరిశీలిస్తున్నప్పుడు దాని స్వభావం మారుతుందేమోనన్న భయం వర్తమాన సమాజాన్ని కాలనాగులా వెంటాడుతోంది. గత రెండేళ్లుగా మన దేశంలో పాశ్చాత్య నాగరికత నీలినీడలు భారతీయ సమాజాన్ని దిగ్బంధనం చేసి ఊపిరాడకుండా చేస్తున్నాయి. ఆ విష సంస్కృతియే ప్రేమలో పడిన స్త్రీ పురుషులకు సాంప్రదాయబద్ధంగా వివాహం చేసుకోకుండానే ప్రేయసీ ప్రియులుగా కలిసి సహజీవనాన్ని కొనసాగించే వీలుని కలిగిస్తోంది. దీనిని సభ్యసమాజమే కాదు అంతర్జాతీయ సమాజపు ఒత్తిళ్ల పొత్తిళ్లలో చిక్కుకున్న న్యాయ వ్యవస్థ సైతం దీనిని బలపరుస్తోంది. ఫలితంగా రెండు వైపుల నుండీ కుటుంబాల అజమాయిషీకీ, పర్యవేక్షణకూ, నిఘాకు, వారి బంధువులూ ఇతర పెద్దలతో పాటు సామాజిక సర్వేయలెన్స్‌కూ దూరంగా జీవిస్తున్నారు. ప్రేమికులిద్దరు ఒకరికొకరుగా, అందరికీ దూరంగా, రహస్యంగా జీవితాల్ని కొనసాగించే క్రమంలో ప్రేమ పేరుతో సహజీవనం చేస్తున్న ప్రేమికుల మధ్య చిన్నా పెద్ద అపార్థాలతో విభేదాలు తలెత్తినప్పుడు క్షణికావేశంలో ఉన్మాదులుగా మారుతున్నారు. దీంతో ప్రియులు తమ ప్రియురాళ్లను ముక్కలు, ముక్కలుగా నరుకుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.

ఆ సంక్లిష్ట సమయంలో అలాంటి హేయమైన చర్యలకు పూనుకోవడం తప్పని వారించే పెద్దవారెవరూ లేని నేపథ్యంలో ఆ కిరాతక చర్యకు పూనుకోవడం కాన్న ఓ క్షణం ముందు వరకు ఆమెను తన ఆరో ప్రాణంగా భావించి ప్రేమించినవాడే కనీసం ఆమె తన లాంటి మనిషేననే ఇంగితజ్ఞానాన్ని సైతం మరిచిపోయి అత్యంత కిరాతకంగా జంతువులాగా ముక్కలు, ముక్కలుగా నరకడం నిర్ద్వంద్వంగా పైశాచికత్వానికి పరాకాష్టగా చెప్పిక తప్పదు. ఈ నేపథ్యంలో తమ ప్రియురాళ్ల ప్రేమ తమకు దక్కనప్పుడు ప్రేమ తన సహజ లక్షణమైన త్యాగాన్ని కాకుండా దానికి భిన్నమైన ద్వేషపు విషాన్నే విరజిమ్ముతోంది.


గతేడాది నవంబరులో ఢిల్లీ మహానగరంలో ఓ ఇరువురి వ్యక్తుల మధ్య మొదలైన ప్రేమ వారి తల్లిదండ్రుల అంగీకారం లభ్యంకాక పెళ్లిగా మారలేదు.

సదరు సంఘటనలో శ్రద్ధావాకర్ తన తల్లిదండ్రులను కాదనుకొని తన ప్రియుడైన ఆఫ్తాబ్‌నే జీవిత సర్వస్వంగా భావించి నాలుగేళ్లపాటు అతనితో సహజీవనం చేసింది. సహజీవన కాలంలో తనని పెళ్లి చేసుకోమని అడిగినందుకే ఆ నరరూప రాక్షసుని చేతిలో అత్యంత కిరాతకంగా హత్య చేయబడి ముప్పై ఐదు ముక్కలుగా నరకబడిన వైనంతో ప్రేమ అనే పదమే యువతుల్లో వారి తల్లిదండ్రుల్లో భయాన్ని రేకెత్తిస్తోంది. దీనికి కొనసాగింపుగా పంజాబ్‌లో, యుపిలో, బీహార్‌లో ఇలాంటి హేయమైన సంఘటనలతో పాటు నిన్నగాక మొన్న ఢిల్లీ మహానగరంలో మరో పదహారేళ్ల బాలికను తన ప్రియుడే ముప్పైనాలుగు కత్తిపోట్లతో అత్యంత కిరాతకంగా హత్య చేసిన వైనం ఆందోళన కలిగిస్తోంది.

బెంగళూరులో తనతో బ్రేకప్ చేసినందుకు ఉన్మాదిగా మారిన ప్రియుడు తన ప్రేమికురాలిని అత్యంత కిరాతకంగా బహిరంగంగా హత్య చేసిన వైనంతో పాటు నిన్నటికి నిన్న ముంబై మహానగరంలో తనతో సహజీవనం చేస్తున్న మహిళను ఇరవై ముక్కలుగా తెగనరికి కుక్కర్‌లో ఉడికించి వివిధ ప్రాంతాలలో పారవేసిన సంఘటనతో నాగరిక సమాజం సిగ్గుతో తల దించుకోవాల్సి వచ్చింది. ఇది జరిగిన మరునాడే హైదరాబాద్ మహానగరంలో ఓ(అ)వివాహిత యువతితో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్న వివాహితుడైన పూజారి తనను పెళ్లి చేసుకోమని బలవంతం చేసిందని ఆమెను అత్యంత క్రూరంగా హత్య చేసి గూగుల్ సమాచారం తోడ్పాటుతో దుర్వాసన రాకుండా మ్యాన్‌హోల్‌లో వేసి పూడ్చి వేసిన వైనం మానవాళిని నిర్ఘాంతపరిచేదే.

హైదరాబాద్‌లో జరిగిన మరో ట్రాయంగిల్ లవ్ స్టోరీలో తన స్నేహితుడు తన ప్రేమికురాలికి చేరువౌతున్నాడనే కసితో అతనిని అత్యంత కిరాతకంగా హత్య చేసి మృతదేహం నుండి గుండెను వేరు చేసి వాట్సాప్ ద్వారా తన ప్రియురాలికి పంపిన వైనంతో సమాజం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. హైదరాబాద్ నగరంలోనే జరిగిన మరో దురదృష్టకర సంఘటనలో సమాజానికి మంచిని బోధించే బాధ్యత గల ఓ టీచర్ ఓ మిస్డ్ కాల్ లవ్‌స్టోరీ వలలో చిక్కుకుని తను ఆత్మహత్య చేసుకోవడమే కాకుండా సదరు యువకుడి మరణానికి కారణంగా మారడం హృదయాల్ని కదిలించేవే. ఇలా భిన్న ప్రాంతాల్లో ప్రేమికులను కసాయివాళ్లుగా మారుస్తున్న సదరు అమానవీయ సంఘటనలు మచ్చుకు కొన్నే. అయితే మిస్సింగ్ కేసుల రూపంలో పోలీస్ రికార్డులకెక్కి హత్యల తాలూకు ఆనవాళ్లను సైతం మిగలకుండా చేస్తున్నవి మరెన్నో? వివిధ మిస్సింగ్ కేసులలో మాయమైపోతున్నవారి వివరాలు అందుబాటులో లేకుండా పోతున్న వైనం దిగ్భ్రాంతిని గొలుపుతోంది.

వర్తమాన సమాజంలో ఇన్ని ఘోరాలు జరుగుతుంటే వాటిని నివారించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ఓ మైనారిటీ మతానికి చెందినవారే లవ్ జిహాద్ పేరుతో మరొక మతానికి చెందిన వారిని ప్రేమ పేరుతో వలలో వేసుకొని అత్యంత కిరాతకంగా హత్యలకు పాల్పడుతున్నారంటూ మత విద్వేషాలను రెచ్చగొడుతూ ఆ నెగళ్లలో రాజకీయ చలి కాచుకునే ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం. చైతన్యవంతులైన ప్రజలు




ఇటీవల పూజారి చేతిలో హత్యకు గురైన అప్సర

గమనించాల్సిన అంశమేమిటంటే ముంబాయిలో సరస్వతీ వైద్యను ఆమె ప్రియుడైన మనోజ్ సానే కబేళా కత్తితో ఎంతో కర్కశంగా తునాతునకలుగా నరికిన సందర్భంలో మెజారిటీ మతంకానీ, దానితో రాజ్యాధికారాన్ని సంపాదించుకోవాలని కుట్రలు పన్నుతున్నవారు మౌనంగా వున్నారు. పై రెండు సందర్భాల్లోనే కాదు అన్ని సందర్భాల్లో ఓ ఉన్మాదిగా, నరరూప రాక్షసుడిగా మారిన మనిషి తోటి మనిషిని జంతువు కన్నా హీనంగా కత్తితో కండగా నరుకుతుంటే అదేదో పోలీసులు, కోర్టులు చూసుకోవాల్సిన వ్యవహారం దానితో మనకేంపని అన్నట్లు పౌరులు ప్రవర్తిస్తుండడం దిగ్భ్రాంతిని గొలుపుతోంది. ఒకరి స్వార్థం మరొకరి దీనత్వం కలిసి కబేళా కత్తులకు పదును పెడుతున్నాయి. నిజానికి ఇలాంటి హేయమైన అత్యంత జుగుప్సాకరమైన హత్యలు జరిగినప్పుడు ఆశించిన స్థాయిలో పౌర సమాజం స్పందించకపోవడం, ఫలితంగా ఇలాంటి సంఘటనలు మళ్లీ మళ్లీ జరుగుతున్నాయనే భావన సర్వత్రా వెల్లువెత్తుతోంది. ఈ నేపథ్యంలో స్త్రీలను దేవతలుగా పూజిస్తామని గొప్పలు చెప్పుకుంటున్న ఈ దేశంలో మహిళలపై పెచ్చుమీరుతున్న అమానవీయ లైంగిక దాడులను, హింసను అరికట్టాల్సిన మహిళా కమిషన్లతో పాటు ఇతర స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలు, ఈ దేశ న్యాయ వ్యవస్థలు సైతం సుమోటోగా ప్రభుత్వాలను నియంత్రించాల్సిన బాధ్యతను నిర్వర్తించడం లేదేమోననే భావనను వ్యక్తీకరిస్తున్న బుద్ధిజీవుల అభిప్రాయంతో ఏకీభవించక తప్పదు.

### చరిత్రలో నిలిచిన ప్రేమలు

దేవదాసు-పార్వతి, హీర్ రాంజా-సలీం అనార్కలి, రోమియో-జూలియట్‌ల ప్రేమ కథల్లో ప్రేమను త్యాగం చేసి ప్రేమకు ప్రాణం పోసిన ఉదంతాలున్నాయి. ప్రేమకోసం ఇద్దరూ ప్రాణాలను త్యాగం చేసిన ఉదంతాలూ వున్నాయి.



దేశంలోనే సంచలనం రేపిన శ్రద్ధావాకర్ హత్య

మరణించిన తమ ప్రియురాలి స్మృతి చిహ్నంగా తాజ్‌మహల్ లాంటి ప్రపంచ వింతని సృష్టించిన సందర్భాలూ వున్నాయి. తన ప్రియురాలైన రాధ కోసం ఆమె శ్రీకృష్ణుడు ఓ చిన్నపాటి యుద్ధం చేసి ప్రేమను గెలిపించుకున్న సంఘటనలూ వున్నాయి. మన దేశ చరిత్ర పుటల్లోకి తొంగిచూసినప్పుడు శకుంతలా-దుష్యంతుల ప్రేమ కానుకైన భరతుడి పేరే ఆలంబనగా మన దేశం భారతదేశంగా మారిందని తెలుస్తోంది. అదే విధంగా ప్రేమలో మోసపోయి తమ ప్రియుడి ఎడబాటుని తట్టుకోలేక ఆడపిల్లలు బలవంతపు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలూ అనేకమున్నాయి. తక్కువ కులం వారితో ప్రేమలో పడిన వైనంపై కసితో పరువు పోతుందనే నెపంతో తమ కూతుళ్లనే కాదు, వారు ప్రేమించిన యువకులనూ సైతం క్రూరమృగాల్లా వెంటాడి వేటాడి నిర్దాక్షిణ్యంగా హత్య చేసిన సంఘటనలూ వున్నాయి. ఇందుకు నల్గొండ జిల్లాలో జరిగిన ప్రణయ్ హత్య పరువు హత్యల పరంపరలో సజీవ ఉదాహరణంగా భావించక తప్పదు. వాటన్నింటికి భిన్నంగా ఈ తరం ప్రేమికులు తమ ప్రేమ విఫలమైన ప్పుడు తామే కసాయివాళ్లుగా మారి తమ ప్రియురాళ్లను కత్తికో కండగా నరికి చెట్టుకో ముక్క, పుట్టకో ముక్క పడేస్తున్న ఘోరమైన సంఘటన లను చూస్తుంటే వారి మానసిక స్థితిని అంచనా వేసే క్రమంలో తల పండిన సైకాలజిస్టులకే వెన్నులో చలి పుట్టుకొ స్తుందని చెప్పక తప్పదు. నాలుగేళ్ల సహజీవనం తర్వాత ఓ మనిషి తన జీవన సహచరిని కుట్రపూరితంగా ఆత్మహత్యకు ప్రేరేపించడం కాదు, క్షణికావేశంలో హత్య చేయడమే కాకుండా ఒక జంతువును నరికినట్లు ఎంతో పాశవికంగా ముక్కలు ముక్కలుగా నరికిచంపడం సదరు శరీర భాగాల్లో కొన్ని ఇంకా ఫ్రిజ్‌లో వున్నప్పటికీ మరో యువతితో ఆ ఇంట్లోనే శృంగారంలో పాలుపంచుకోవడం నరరూపం రాక్షసులను సైతం మరిపించేదేనని చెప్ప తప్పదు.

ఈ మధ్య కాలంలో ఈ అత్యంత కిరాతక ప్రవృత్తి ప్రేమికుల నుండి వివాహేతర సంబంధాల వలలో చిక్కుకున్నవారికి వ్యాపిస్తున్న నేపథ్యంలో తమ అక్రమ లైంగిక సంబంధాలను కప్పిపుచ్చుకోవడానికి తమ జీవిత భాగస్వాములనే కాదు సదరు అమానవీయ ఘటనలను చూసిన పిల్లలు వారి అక్రమ సంబంధాన్ని ఎక్కడ బయట పెడతారేమోననే భయంతో వారిని సైతం అత్యంత కిరాతకంగా హత్యలు చేస్తున్న వైనం గుండెలను పిండేస్తోంది. ఈ నేపథ్యంలో వారిలో ఈ అమానవీయ రాక్షస ప్రవృత్తిని కలిగిస్తున్నదెవరో తెలుసుకోలేకపోతే పరిస్థితులు మరింత విషమించి మహిళల జీవనం మానవ మృగాల మధ్య దిన దిన గండంగా మారే ప్రమాదం లేకపోలేదు. ఇలాంటి



హేయమైన నేరాలు జరిగినప్పుడు నేర పరిశోధనల్లో భాగంగా సంబంధిత అధికారులు నేరస్తులను ఇంటరాగేట్ చేస్తున్నప్పుడు వెబ్ సిరీస్, నెట్‌ఫ్లిక్స్, ఓ.టి.టిల్లో క్రైమ్ సీరియల్లే తమకు ప్రేరణ అని, ఇంటర్నెట్ ద్వారా ఎలా హత్య చేయవచ్చు? మృతదేహాన్ని ముక్కలు ఎలా నరకవచ్చో అనేకసార్లు చూడడం ద్వారానే చేయగలిగామని చెప్పడం గమనార్హం. అలా చేయడానికి అవసరమైన ధైర్యాన్ని కూడగట్టుకోవడానికి వారికున్న మద్యం, మత్తుపదార్థాల అలవాటు వెన్నుదన్నుగా నిలుస్తోందని నేరస్తుల నేర చరిత్ర రుజువు చేస్తోంది. మరోవైపు క్షుద్ర శక్తులను ఆవాహన చేసుకోవడం ద్వారా మానవాతీత శక్తులను వశం చేసుకోవడానికి నరబలే మార్గమని నమ్మిన మూర్ఖులు ఒకరిద్దరు తోటి మనుషులను మాయ చేసి మభ్యపెట్టి అత్యంత కిరాతకంగా ముక్కలు ముక్కలుగా నరికి నరమాంస భక్షణకు పూనుకున్న ఉదంతం మనిషి రాక్షసుడిగా రూపాంతం చెందుతున్న వైనాన్ని తేటతెల్లం చేస్తోందని చెప్పక తప్పదు. నిన్నటికి నిన్న బెంగళూరులో ఓ ఒంటరి మహిళలను ఆమె ఇంట్లో అద్దెకున్న కిరాయిదారులే ఆమె ఆస్తిని కాజేయడం కోసం ముక్కలు, ముక్కలుగా నరికి వివిధ ప్రాంతాలలో పారవేసిన వైనంతో కొత్తకోణం ఆవిష్కరించబడింది.

### అమానవీయ చర్యలకు ఆజ్యం పోస్తున్న సోషల్ మీడియా!?

ఆధునిక ప్రపంచంలో మనుషులను అనూహ్యంగా ప్రభావితం చేస్తున్న సోషల్ మీడియా మనుషుల్లో జంతు ప్రవృత్తిని విచ్చలవిడిగా పెంచి పోషిస్తున్న వైనం అత్యంత దురదృష్టకరంగా మారుతోంది. తరతరాలుగా మానవ సంబంధాలకు దుర్భేద్యమైన రక్షణ కవచంగా కొనసాగుతున్న నైతిక విలువలపై సోషల్ మీడియా విచ్చలవిడి దారులతో ఏకమొత్తంగా మనుషులను పశువులుగా మారుస్తుంది. కార్యాలయాల్లో, కార్ఖానాల్లోనే కాదు అన్ని పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక దాడులు, హింస పెచ్చుమీరుతున్నాయి. ఇంటా బయటా ఎక్కడ కూడా రక్షణ లేక పూర్తి అభద్రతతో మహిళలు జీవనాన్ని కొనసాగించక తప్పడం లేదు. ఆధునిక సాంకేతికత ఆలంబనగా సోషల్ మీడియాలో అశ్లీలం పొంగిపొర్లుతోంది. దానికి బానిసగా మారి ఉన్మాదులుగా మారుతున్న వారిలో కౌమారదశలో నున్న యువతే కాకుండా మధ్య వయస్కులు, పెద్దలు సైతం సదరు అశ్లీల ప్రభావానికి గురై పసిపిల్లల నుండి పండు ముదుసలి వరకు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతుంటే సభ్యసమాజం సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా సోషల్ మీడియాపై తగిన చర్యలను తీసుకోలేక ప్రభుత్వం నిస్సందేహంగా తన నిస్సహాయితను చాటుకుంటున్నది.

## ఉమ్మడి కుటుంబ విచ్ఛిన్నం కూడా ఒక కారణమేనా?



కాల గమనంలో నాగరికత పేరుతో రక్తమాంసాలను పంచి ఇచ్చి ప్రాణం పోసిన తల్లిదండ్రులతో సహా వాటిని పంచుకుని పుట్టిన అన్నదమ్ములను, అక్కాచెల్లెళ్లను ఇతర కుటుంబ సభ్యులను కూడా కాదంటూ వారికి దూరంగా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం పేరుతో వేరుపడి ఒంటరిగానే జీవిస్తున్నాడు. తనను స్వర్గంలోకి చేరవేస్తుందని నమ్మిన ఆయన ఒంటరి తనమే ఆయనను నరకకూపంలోకి తోసివేస్తున్న వైనం అత్యంత దురదృష్టకరం. జీవితంలో ఆనందకరమైన క్షణాలను అన్నింటినీ తానే అనుభవించాలనే స్వార్థంతో బతుకు వెళ్లదీయడం గమనార్హం. ఈ నేపథ్యంలో తన జీవన యానంలో ఎదురయ్యే ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సిన సమయంలో సర్దుబాటు వీలుకానప్పుడు విడిపోయి ఎవరి బ్రతుకువారు బతకొచ్చనే లౌక్యం వారిలో ఎందుకు కలగడం లేదో అర్థం కావడం లేదు. తమ సహజీవనంలో తగాదాలు తలెత్తినప్పుడు, విభేదాలు పొడసూపినప్పుడు ఓ మెట్టు దిగి ఒకరికొకరు ఒదిగి సామరస్యంతో జీవనాన్ని కొనసాగించే ఆలోచన వారిలో ఎందుకు కలగడం లేదో తెలియడం లేదు. ఇలాంటి సలహాలనిచ్చే ఆత్మీయులైన స్నేహితులు, బంధువులు కుటుంబ సభ్యుల తోడ్పాటు లేక మానసిక ఒత్తిడిలో మృగంగా మారుతున్న మనుషులు హత్యలకు పూనుకోవడమో, ఆత్మాన్యూనతా భావంతో ఆత్మహత్యలకు పాల్పడుతుండడమో ప్రశ్నార్థకంగా మారుతోంది.

## ఈ హత్యాకాండను ఆపాల్సిందెవరు?

మనిషి తోటి మనుషులను అత్యంత హేయమైన రీతిలో హత్య చేయడమే కాదు, మృతదేహాన్ని ముక్కలుముక్కలుగా నరకడంతో పాటు మానవాతీత శక్తులు లభిస్తాయనే మూర్ఖత్వంతో మానవ శరీరాన్ని భుజించే నికృష్టమైన స్థితిలోకి వెళ్లడానికి వారి మెంటల్ డిజార్డరే కారణమేమోననే అంశంపై మానసిక వైద్యుల చేత సమగ్ర అధ్యయనం జరగాలి. మెజారిటీ సందర్భాలలో ఈ అత్యంత హేయమైన హత్యలకు అక్రమ వివాహేతర లైంగిక సంబంధాలే కారణాలుగా మారుతున్న క్రమంలో సామాజికవేత్తల తోడ్పాటుతో వాటి మూలాల్లోకి వెళ్లి సదరు అమానవీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. మరోవైపు సమాజ నిర్మాణానికి మూలమైన కుటుంబంలో ప్రతి తల్లిదండ్రీ ఉగ్గుపాలతోనే తమ పిల్లలకు తోటి మనుషులను ప్రేమించే తత్వాన్ని నైతిక విలువలతో జత చేసి అందించాలి. శారీరక పెరుగుదలతో అత్యంత సంవేదనాశీలమైన కౌమారదశలో పిల్లల శారీరక, మానసిక స్థితిలో వచ్చే మార్పుల ఫలితంగా వారి లైంగిక ప్రవర్తనను అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు వారిని మంచి మార్గంలో నడిపించడానికి అవసరమైన స్ఫూర్తినీ, మార్గదర్శకత్వాన్ని తల్లిదండ్రులుగా వారికి అందించాలి.

నాగరికత ముసుగులో మేకవన్నె పులుల మధ్య తిరుగుతున్న తమ ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలంటే వారు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్‌లను ఎలా ఉపయోగిస్తున్నారో నిరంతర నిఘాతో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఎందుకంటే సోషల్ మీడియా విషవలయంలో



చిక్కుకుంటున్న అనేకమంది అమాయక యువతులు బలిపశువులుగా మారుతున్నారు. మరోవైపు ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తితో పాఠశాల స్థాయి నుండే నైతిక విలువలతో పాటు శాస్త్రీయ విజ్ఞానాన్ని అందించే విద్యావిధానాన్ని రూపొందించాలి. తద్వారా పసితనం నుండే మూఢనమ్మకాల ఊబిలో చిక్కకుండా యువతను కాపాడాలి. దేశంలోని జాతీయస్థాయి విశ్వవిద్యాలయాల్లో బాబాలు, అఘోరాలు క్షుద్రశక్తుల మనుగడకు ఊతమిచ్చే భూతవైద్యం లాంటి కోర్సులను విద్యాప్రమాళిక నుండి

తొలగించాలి. కృత్రిమ మేధస్సుతో విజ్ఞానపు కిటికీ ద్వార ఈ సమాజంలోకి వెల్లువలా ప్రవేశిస్తున్న నెట్‌సిరీస్, నెట్‌ఫ్లిక్స్, ఓటిటి, అమెజాన్‌లాంటి ప్లాట్‌ఫాంలు అశ్లీలాన్ని భయంకరమైన నేరప్రవృత్తినీ, ఉన్మాదంతో కూడిన వారి హేయమైన లైంగిక వాంఛలను తీర్చుకోవడానికి ఉపయోగపడే మార్గాలను ఈ దేశయువత మనస్సుల్లోకి చొప్పిస్తున్నాయనేది నిర్వివాదాంశమే. దీనికి కొనసాగింపుగా అవధుల్లేని ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్‌ల అందుబాటు ఫలితంగా ఈ రాక్షసప్రవృత్తి సోషల్ మీడియా ద్వారా వైరల్ అందరి మనస్సుల్లోకి ఈ విషాన్ని శరవేగంతో చేరవేస్తోంది. అందుకే ఇంటర్‌నెట్ అనుసంధానంతో నడుస్తున్న నెట్‌వర్క్‌లన్నీ స్వీయ నియంత్రణను పాటించడం ద్వారా సమాజానికి హాని కలిగించే కంటెంట్‌తో కార్యక్రమాలను రూపొందించకుండా వుండాలి. ఇది సాధ్యం కానప్పుడు ప్రభుత్వమే వాటిని సెన్సార్ ద్వారా తొలగించాలి.
అంతేకాకుండా సదరు అమానవీయ ఘటనలను జరగకుండా నిరోధించడానికి కఠినమైన చట్టాలను రూపొందించడమే కాకుండా త్రికరణశుద్ధిగా వాటిని అమలుపరచాలి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా నేరస్తులను విచారించి కఠినశిక్షలను ముక్కలుగా నరికిచంపుతున్న ఈ రాక్షసకాండను సభ్యసమాజం ముక్తకంఠంతో ఖండించాలి. పత్రికలు, ప్రసారసాధనాలు సైతం తమవంతు సామాజిక బాధ్యతగా మనుషుల్లో ఇలాంటి హేయమైన హింసాప్రవృత్తిని అరికట్టడానికి అవసరమైన అవగాహనను కలిగించాలి.
అంతకన్నా ముందు నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణం కుటుంబం పునాదిగానే జరుగుతుంది. కాబట్టి ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉగ్గుపాలతోనే నైతిక విలువలను రంగరించి పోసే బాధ్యతను త్రికరణశుద్ధిగా నిర్వర్తించాలి.
ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్‌లో భాగంగా పోలీస్ వ్యవస్థ నిఘా నేత్రాలుగా వ్యవహరించే సిసి కెమెరాలుగానీ కమాండ్ కంట్రోల్ వ్యవస్థగానీ నిరంతరం పని చేస్తూ ఇలాంటి హేయమైన సంఘటనలు జరగకుండా నిరోధించడానికి ఉపయోగించబడినప్పుడే వాటికి సార్థకత చేకూరుతుంది. అలా కాకుండా సదరు సంఘటన తాలూకు పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ తయారు చేయడానికి సహకరించడం ద్వారా ఇలాంటి ఘోరనేరాలు జరగకుండా ఆపలేమనే సత్యాన్ని ప్రభుత్వాలు గ్రహించాలి. ఫలితంగా రేపటి హంతకులు నేటి సామాన్యులుగా మనమధ్యలోనే సంచరిస్తూ భరించలేని మానసిక ఒత్తిళ్లతో దేశంలోని ఏదో ఒకచోట ఎవరో ఒక మనిషిని అత్యంత అమానవీయంగా కత్తితో నరకడానికి కబేళా కత్తులతో సిద్ధంగా ఉంటారు. అవధుల్లేని ఆవేశంతో హత్యలు చేస్తారు. తాము చేసిన ఘోరనేరానికి కఠిన శిక్ష పడుతుందనే భయంతో ఆధారాలను చెరిపే క్రమంలో మృతశరీరాలను ముక్కలు ముక్కలుగా నరికి చెట్టుకో ముక్కపుట్టకో ముక్కను వెదజల్లుతారు. ఈ అత్యంత హేయమైన హత్యాకాండ



తాలూకు బ్రేకింగ్ న్యూస్ కవరేజీ ద్వారా రేటింగ్‌లు పెంచుకోవడానికి ఎలక్ట్రానిక్ ఛానళ్లన్నీ తమతమ కెమెరాలతో పోటీపడతాయి. సదరు రాక్షస కాండను మరుసటిరోజు పత్రికల్లో మనుషులే మనుషులను రంపపు కోతలతో మాంసపు ముద్దలుగా మారుస్తున్న విషాదసంఘటన అంటూ పతాక శీర్షికలతో హోరెత్తిస్తారు. మానవ సంబంధాలన్నీ భరించలేని ఒత్తిళ్లతో జీవన్మరణ సమస్యలుగా మారిపోతాయి. రోజులు గడుస్తూనే వుంటాయి. నరరూపరాక్షసులుగా మారుతున్న మనుషుల చేతుల్లో వారికి అత్యంత ప్రియమైన వారు మళ్లీమళ్లీ విగత జీవులుగా మారుతూ ఇంత జరుగుతుంటే మీరేం చేస్తున్నారని ప్రభుత్వాలను ప్రశ్నిస్తాయి.
అ అమానుష హత్యాకాండ ఆగాలంటే మనుషుల్లో మానసిక పరివర్తన రావాలి. అందుకు కుటుంబ వ్యవస్థ నడుం కట్టాలి. పౌర సమాజం మేలుకోవాలి. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో మానవీయ విలువలను బోధించే విద్యావిధానంతో ఓ ఆదర్శసమాజ నిర్మాణానికి పునాది వేయాలి.
ఈ తంతునంతా ఓ యజ్ఞంగా చిత్రీకరిస్తూ పత్రికలూ, ప్రసార సాధనాలు విస్తృత ప్రచారంతో ప్రజల్లోకి వెళ్లి వారిని చైతన్యపరుస్తూ హింసకు తావులేని ఓ ఆదర్శ సమాజ నిర్మాణానికి ప్రజలను సమాయత్తం చేయాలి. ❑





# అమెరికాలో ఉన్నత విద్య

**తమ పిల్లలు** విదేశాల్లో చదువుకోవాలని చాలామంది తల్లిదండ్రులు కోరుకుంటారు. ప్రత్యేకంగా అమెరికా అంటే మరింతగా ఇష్టపడుతున్నారు. ఇటీవల కాలంలో అమెరికాలో చదువుకోవడం మరింత క్రేజీగా, అవసరంగా మారిపోయింది. అందుకు తగినవిధంగా విద్యను అందించడానికి ఇక్కడి కాలేజీలు పోటీపడుతుంటాయి. దీనికి ముఖ్యమైన కారణం మంచి ఉద్యోగ అవకాశాలు అమెరికాలో ఉండడం వల్ల. అక్కడి సభ్యసమాజం అందరినీ కలుపుకునిపోతుంది. ఇంకా పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ చదువుకోవచ్చు. అందుకే 2021-22 విద్యాసంవత్సరంలో అమెరికాలో పదిలక్షల మంది విద్యార్థులు ప్రపంచం నలుమూలల నుండి వచ్చి చదువుకుంటున్నారు. మనదేశం నుండి ఎక్కువమంది అమెరికా డాలర్ కలలుకంటూ వెళ్తున్నారు. దీనికి మరో ముఖ్యమైన కారణం పఠనమాధ్యమం ఆంగ్లం కావడం వల్ల సులభమవుతున్నది.

మనవాళ్లని అమెరికా సంస్థలు నమ్మకంతో బాధ్యతలు అప్పచెప్పడం విశేషం. ఎప్పటి నుండో అమెరికా వాసులతో కలిసిపోయి ఉన్నారు. అక్కడ స్థిరపడి వ్యాపారం కూడా మనం చేస్తున్నాం అనే భావన ఉంది. అమెరికాలో భారత్‌బ్రాండ్ వికసించి ఉండడం తరతరాలకు అదృష్టం. అమెరికాలో ఎన్నో రకాల కోర్సులు ఉన్నాయి. అవి అండర్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం. ఇవి నాలుగు సంవత్సరాల సమయంలో పూర్తి చేయాలి. 120-130 క్రెడిట్ అవర్స్ గంటల కాలపరిమితి. కమ్యూనిటీ కాలేజీలు ఉన్నాయ్. వీటిలో తక్కువ ఫీజు కానీ విశ్వవిద్యాలయాల స్థాయిలో పోల్చడం తగదు కనుక అంత ప్రాముఖ్యత లేదు. అతి ముఖ్యమైన కోర్సు మాస్టర్స్ బిరుదు. దీనికి విపరీతమైన గుర్తింపు. మన విద్యార్థులు ఎక్కువగా చేరి చదువుతున్న డిగ్రీ యిది. మాస్టర్స్‌కి రెండు సంవత్సరాల కాలవ్యవధి, 30 నుండి 60 క్రెడిట్ అవర్స్ కూడా ఉంటుంది. పిహెచ్‌డి పరిశోధనలకు విద్యావిధానం అమెరికాలో ఉత్తమం. అదేరంగంలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయ్. అమెరికాలో చదవడానికి కావలసినది పాఠ్యాంశంలో తీవ్ర అభినివేశం. పట్టువిడవకుండా చదవడం ప్రధానం. విశ్వవిద్యాలయం అడ్మిషన్ లెటర్ ఉంటేనే స్టూడెంట్ వీసా లభిస్తుంది. స్కోలాస్టిక్ అసెస్మెంట్ టెస్ట్ వంటివి ఎన్నో పాస్ కావాలి. ఆంగ్లంలో మంచి పట్టు ఉండాలి. ఎఫ్ వీసా ఏం వీసా వంటివి ఉన్నాయి. అమెరికాలోని ఐవీలీగ్ యూనివర్సిటీలో చదవాలని చాలామంది అనుకుంటారు. హార్వార్డ్, ఎల్, ప్రిన్స్‌టోన్, కొలంబియా, కోర్నేయిల్, డార్‌మాత్, పెన్సిల్వేనియా వంటి యూనివర్సిటీల సమాహారం, బోధనలో ఎంతో పేరు పొందాయి. ఐవీలీగ్ 1954లో క్రీడా పరిశీలనా కోసం ప్రారంభించారు. ఆ తరువాత విద్యారంగంలోకి మారడం జరిగింది. అమెరికాలోని కొన్ని ప్రముఖవిద్యా సంస్థల పేర్లను చూద్దాం.

ఈ.ఎస్.మాధవన్

- ఏంఐటి మసాచ్యుసెట్స్ అని పిలవబడే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ,
- స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ కాలీఫోర్నియా,
- కాలిఫోర్నియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ,
- యూనివర్సిటీ ఆఫ్ చికాగో,
- జోన్ హాప్కిన్స్ యూనివర్సిటీ ఇల్లినోయి
- నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీ బాల్టిమోర్ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బెర్కెలీ

ఇవన్నీ కూడా ప్రపంచంలో విద్యావ్యాప్తికి పేరు పొందిన విశ్వవిద్యాలయాలు. ఇక్కడ చదివి నోబెల్ బహుమతి పొందిన వారు, ఎన్నో కనిపెట్టిన శాస్త్రవేత్తలు ఉన్నారు. అమెరికాలో చదువుతూ ఉద్యోగం చేసుకునే ఒక గొప్ప విధానం ఉంది. సెలవు రోజులలో 40 గంటల క్లాసులు ఉన్నప్పుడు 20 గంటలు పార్ట్‌టైం ఉద్యోగం చేసుకోవచ్చు. ఆవిధంగా విద్యార్థి తన ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చు. అలాగే మరో గొప్ప విషయం చదువు పూర్తి చేసుకున్న విద్యార్థుల కోసం స్టార్ట్ ఆఫ్ స్కాలర్‌షిప్ అందిస్తోంది. ఉత్తర కాలిఫోర్నియాలో సిలికాన్‌వాలీ అనే ప్రదేశంలో ప్రపంచంలో పేరు పొందిన గూగుల్, ఆపిల్ వంటి ఐటి కంపెనీలు ఎన్నో ఉన్నాయి. స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల దీర్ఘవీక్షణమే సిలికాన్ వాలీ. మరి ఎందుకు ఆలస్యం మీరు కూడా ప్రయత్నించండి. ఆల్ ద బెస్ట్. ❑






# గతం విలువ


గడిచే ప్రతి క్షణంను స్వాగతించే మాయలాడి
సమయం, సందర్భాలతో దాడి చేస్తూ,
మదిని దోచేస్తూ, వర్తమానాన్ని శాసిస్తూ
వెన్నంటి వుండే వగలాడి.
కాలం హరిస్తుంది కానీ జ్ఞాపకాలు గతించవు
'గతం'తో కలిసి జీవిస్తాయి.
అవసరాన్ని బట్టి మదిని తొలుస్తుంటాయి.
రేపుకు చోటు లేదేమో-గతంకి మది నిండా చోటు
విహంగంలా విహరిస్తూనే వుంటది.
తియ్యని అనుభూతులతో పూతమిస్తుంది.
చేదు అనుభవాలతో హెచ్చరిస్తూనే ఉంటుంది
గతం నిరంతరం శ్రమిస్తోంది
రేపు నువ్వు ఉంటావనే ఆశతో నిన్ను నడిపిస్తుంది.
నీతో పాటే పోయినా ఇంకెందరో మదిలోపలి
జ్ఞాపకాల తోరణంలో 'ఆకు'గా నిన్ను బతికే వుంచుతుంది.
గతాన్ని గడ్డి పరకలా తీసేయకు లేదంటే అంతా సమాప్తం!
ఒక జ్ఞాపకాల మందిరం-అనుభవాల పంజరం
అనుభూతుల లోగిలి-భవిష్యత్తుకు/ బాసటగా అల్లుకున్న
పందిరి/ గతం ఒక సంఘర్షణల పుట్ట-నిక్షిప్తమైన సంఘటనల/
నిఖార్సైన కోట!

**- న్యాలకంటి నారాయణ**

# సంక్షోభ సమయం



ఇక్కడ ముసురుకుంది వాన
ఎప్పుడు వరదౌతుందో
ఎప్పుడు పిడుగౌతుందో
తెలియని సంక్షోభపు వాన.
నగరంలోనే కాదు
సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లోనూ కురుస్తోంది.
ఏ నెత్తిన ఏ రాయి పడుతుందో
ఈ ఆర్థిక మాంద్యపు నీడలు
ఎప్పుడు వీడుతాయో
ఈ దేశమే కాదు
అగ్రరాజ్యం వణుకుతోంది.
కూచున్న ఏ.సీ.సీటులోంచి
పొగలు రావటం చూడలేం
ప్రత్యక్షంగా అనారోగ్యాన్ని
చవిచూస్తాం అంతే.
వలసలు ఎందుకు పోవాలి
ఉన్నచోట ఉత్పాదక అసాధ్యమా.
ఆలోచనలు పదును పెట్టాలి
కాలంతో ప్రశ్నలు
సంధించాలి.
ఓ కొత్త ఆలోచన
ఎందరి జీవితాలకో వెలుగు
నింపాలి.
ఇక్కడ సమస్యల్లా
చొరవ లేకపోవడమేమన స్వప్నాల్ని
మనం నిర్మించుకోకపోవడమే.



**- గవిడి శ్రీనివాస్**

# ఆత్మీయతల జాబిల్లి


నువ్వు లేని చోటు
అమావాస్య కటిక చీకటిని,
నీ ఉనికి పున్నమి వెన్నెలను
కురిపించే జాబిల్లిని
తలపిస్తోంది.
నువ్వున్న పొదరిల్లు
పక్షుల కిలకిలరావాల కోనేరు
నీ ఆత్మీయతల ప్రవాహం
వెల్లివిరిసే నిత్య సెలయేరు.
పెదాలపై చెదరని దరహాసం
నీ మధుర భాషణం,
అంతులేని సహనం
నీ విశేష ఆభూషణం.
అడుగడుగునా
అవమానాల శల్య పరీక్షల్ని,
అణిచివేతల దుష్ట
సాంప్రదాయాల్ని
సైతం ఎదుర్కొని నిలబడ్డ
ఆత్మవిశ్వాసం నీ సొంతం..
కష్టాల్లో కుంగిన ప్రతిసారి
కడలి తరంగమై ఎగిసి,
అణిచిన ప్రతిసారి
అహంకారాల
అగ్నిపర్వతాన్ని బద్దలు కొట్టిన
జ్వాలాముఖివై జ్వలిస్తావు.
పడిన ప్రతిసారి లేచి నిలబడ్డ
ఉత్తుంగ తరంగం,
అనుబంధాల్ని నిత్యం పచ్చగా
నిలిపే రహస్య సొరంగం
నువ్వే.

**- సర్ఫరాజ్ అన్వర్**



పుస్తక సమీక్ష

## 'తెలంగాణ ప్రగతి వెలుగుల నీడ' అభివృద్ధికి జాడ



బంగారు తెలంగాణ దార్శనికుడు, రాష్ట్రముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకి ఈ పుస్తకం అంకితం చేసారు రచయిత మెట్టు శ్రీనివాస్. ఆర్థిక మూలమట్టాలను కొలిచి చూపుతున్న మెట్టు అంటూ తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్, ప్రజల ఆకాంక్షల విశ్లేషణే వెలుగునీడ అంటూ జలవనరుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వి.ప్రకాష్ మెట్టుమెట్టు ఎక్కుతూ అంటూ ఎం.పి.రాజ్యసభ వద్దిరాజు రవిచంద్ర చక్కటి విలువైన ముందు మాటలు రాసారు. 21వ శతాబ్దం ప్రగతి అన్నట్లుగా 21 అధ్యాయాలున్న సమగ్ర తెలంగాణ అభివృద్ధికి అంకెలతో సహా అథెంటిసిటీ (ప్రామాణికత)తో రచయిత మెట్టు శ్రీనివాస్ ఈ పుస్తకం రాసారు. అధ్యాయన విద్యార్థులకు, పరిశోధకులకు, రాజకీయ కార్యకర్తలకు పోటీపరీక్షలకు వెళ్లే ఉద్యోగార్థులకు ఈ పుస్తకం చక్కటి దారిదివిటీ, విలువైన కరదీపిక. రాష్ట్రపురోగమనంలో వాస్తవాలు, నిజాలు, సత్యాలు తెలుసుకోవడానికి ఈ పుస్తకం ఎంతో ప్రయోజనకారి. సకల జనసమగ్రాభివృద్ధి (పేజీ.67). సాగునీటి రంగం, సంస్కరణలు (72), పర్యావరణ సమతుల్యతే ప్రగతి (పేజీ:96), మహిళా ఆత్మగౌరవం (పేజీ.112), భూసర్వే వాస్తవాలు (పేజీ.77), కేంద్ర బడ్జెట్స్ తెలంగాణ పట్ల వివక్ష, (పేజీ:48), దళితబంధు ఉద్యమం (పేజీ.30) లాంటి అధ్యాయాల్లో రచయిత విశ్లేషణ బాగుంది. కోటి ఎకరాల మాగాణిగా తెలంగాణ నేడు ఉంది. 2014లో విద్యుత్, 1,110 యూనిట్లు ఉంటే, ఇప్పుడు 2,012 యూనిట్లు పెరిగింది. గోదావరి 600 టిఎంసిలు వినియోగించే స్థాయికి నేడు చేరింది. ఇలా ఎన్నో ఆసక్తికర ప్రగతి, అభివృద్ధి ఈ పుస్తకం నిండా. అక్షర వెలుగునీడ గమనించగలం. **(వెలుగుల నీడ, రచన: మెట్టు శ్రీనివాస్, వెల: రూ 140, ప్రతులకు: తెలంగాణ పబ్లికేషన్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, ముషిరాబాద్, హైదరాబాద్)**

**- తంగిరాల చక్రవర్తి**


## 'మద్దాళి రఘురామ్' 'కిన్నెర' నాద కవితా సంపుటి



సాంస్కృతిక సంస్థ నిర్వాహకునిగా, దశాబ్దాల తరబడి కిన్నెర రఘురామ్‌గా సాహితీ, సాంస్కృతిక కళారంగాలలో కవిగా సుప్రసిద్ధులైన మద్దాళి రఘురామ్, ఆజాదీగా అమృత మహోత్సవ్ సందర్భంలో 'అమ్మా! భారతీ వందనం' కవితా సంపుటి ప్రచురింపచేసారు. భారతమాత దాస్యశృంఖలాలు తెంచే మహోజ్వల్యన్నంలో అనంతర స్వతంత్ర భారతంలో తనయులను (కార్గిల్ యుద్ధంలో) కోల్పోయిన ఒక మాతృమూర్తి కథనం, సంపుటి ముఖచిత్ర వివరణగా కవి హృదయాన్ని ప్రతిబింబింప చేస్తోంది. ఈ కవితా సంపుటిలో 27 కవితలు సందర్భానుసారంగా వైవిధ్యవస్తు ఇతివృత్తాలు కలిగి వున్నాయి. వై.కె.నాగేశ్వరరావు, శోభానాయుడు, ఆత్రేయ, కారా, వడ్డాది పాపయ్య, రాచకొండ, కందుకూరి, ఘంటసాల, సినారె, పింగళి, జమున, నటరాజ రామకృష్ణ, నాజర్, ఈమని శంకరశాస్త్రి, పుచ్చా వంటి వివిధరంగాల లబ్ద ప్రవిష్టులైన ప్రముఖుల నివాళి, జయంతి, వర్ధంతి సందర్భాలను పురస్కరించుకొని మద్దాళి కవిగా, అద్భుతంగా స్పందించారు. రచయితల ప్రతిభావిశేషాలు, ప్రతీ కవితలోను సున్నిత హృదయ ప్రతిభావంతంగా స్పృశిస్తున్నాయి. కిన్నెర ప్రచురణలు అందించిన ప్రశంసనీయమైన ఈ కవితాసంపుటి రఘురామ్, సాహితీ జీవనతత్వ గాథ వివేచనలను, అనుభూతి ప్రతిరూపాలుగా అక్షరీకరిస్తోంది. కవి రఘురామ్ అభినందనీయులు.
**(అమ్మా! భారతీ! వందనం, రచన: మద్దాళి రఘురామ్, వెల: రూ 100, ప్రతులకు: నవచేతన, నవోదయ బుక్‌హౌస్‌లు)**

**- యర్రమిల్లి**

## పొట్టివే కానీ గట్టి కథలు



కథంటే ఏమిటి అన్న ప్రశ్నకు ప్రఖ్యాత కథకులు ఎం.ఎస్.వి.గంగరాజు 'కథంటే జీవితం, కథలంటే అనుభవాల సారానికి కాస్త కల్పన దట్టించటం' అంటారు. బరంపురం వాస్తవ్యులు తాతిరాజు జగం ఆది నుండి సాహిత్యాభిమాని. అరవయ్యేళ్లలో వయసులో స్వానుభవసారానికి 'కల్పన' జోడించి, ఫేస్‌బుక్‌లో కథలు రాయటం మొదలు పెట్టారు. కరోనా కష్టకాలంలో వీరి రచనల వేగం పెరిగింది. తోటి రచయితల వల్ల స్ఫూర్తిపొందుతూ వందకుపైగా కథలు ఫేస్‌బుక్‌లో పెట్టారు. అందులోంచి మంచివనుకున్న 65 కథల్ని ఈ సంపుటి ద్వారా మనకు అందిస్తున్నారు. ఇచ్చిన కథలో సింహభాగం చిన్నకథలే! ఒక్కో కథ అచ్చులో పేజీ దాటలేదు. అయినా, రచయిత కనబరిచిన ఎత్తుగడ కథనరీతి ముక్తాయింపు అన్ని అనుభవమున్న రచయితలా వివరించారు. కరోనాకాలంలో లాక్‌డౌన్, ఉద్యోగిగా బ్యాంకు అనుభవం, మనుషుల మంచితనం, మానవత్వం, కరుణ ఇవన్నీ కథల ఇతివృత్తాలై శోభించాయి. కొన్ని కథల్లో (వాయసమలకేశవృద్ధిని తోడు దొంగలు సురమిత్ర) హాస్యం కూడా అంతర్లీనంగా ప్రవహిస్తూ పాఠకులను ఉల్లాసరుస్తాయి. వీర(య్య) మరణం, అన్నదాత లాంటి కథలు చదువుతుంటే పాఠకుడి గుండె చెమర్చకుండా ఉండలేదు. మనుషుల్లో మంచితనం, ఆదుకునే మనఃస్తత్వం ఇంకా బ్రతికి ఉందన్న సత్యం గోచరిస్తుంది. సాహిత్యాభిలాష దండిగా ఉన్న కుటుంబంలోంచి వచ్చినట్లు తెలుస్తున్న తాతిరాజు జగం ఇప్పుడిప్పుడే రాయటం మొదలుపెట్టారు. ముందుముందు మరిన్ని మంచి కథలు వీరి నుండి రావాలని ఆశిద్దాం.
**('డిస్కౌంట్'తో 65 కథలు, రచన: తాతిరాజు జగం, వెల: రూ 150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)**

**- కూర చిదంబరం**

# ఇవి పిల్లల షూస్



ఎదిగే పిల్లల కోసం షూ ఎంపిక చేయడం పెద్ద సవాలు. మోడల్ నచ్చిందంటే సైజు నచ్చదు. సైజు కుదిరిందంటే మోడల్ విషయంలో రాజీ తప్పదు. పిల్లలు పెరుగుతారు కదా అని ఎప్పుడూ పెద్ద సైజువే తీసుకుంటారు. కానీ సరిగ్గా సరిపడని షూతో పాదాల ఆకారంలో సమస్యలు వస్తాయని గమనించాడు పుణెకు చెందిన సత్యజిత్ మిత్తల్. 'పదేళ్ల వచ్చేంత వరకూ పిల్లలు వారికి సరిగ్గా సరిపోయే పాదరక్షలు వేసుకోవడం అరుదు. మూడేళ్లలోపు వరకూ పిల్లల్లో ప్రతి మూడు నెలలకూ పాదాల సైజులో మార్పు వస్తుంది. ఆ తర్వాత ఎదుగుదల కొద్దికొద్దిగా ఉంటుంది. వారికి 13 ఏళ్లు వచ్చేంతవరకూ ఈ సమస్య ఉంటుంది. ఆపైన పాదాల సైజులో మార్పుచాలా స్వల్పంగా ఉంటుంది' అని చెబుతారు వ్యాపారిగా మారిన ఈ డిజైనర్. 2020లో పిల్లల పాదాల ఎదుగుదలపైన పరిశోధన చేస్తూ చాలామంది వైద్యనిపుణులతో మాట్లాడాడు. పాదాల అంచుల్లో సున్నితమైన నరాల నిర్మాణం ఉంటుంది. వాటికి అడ్డంకి ఉంటే సమస్యలు వస్తాయని గుర్తించాడు. రెండేళ్ల పరిశోధన తర్వాత పిల్లల పాదాల సైజుతోపాటు పెరిగే షూస్‌ని అభివృద్ధి చేసి తన స్నేహితురాలు కృతికాల్‌తో కలిసి షూ తయారు కంపెనీ 'అరెట్టో'ను ప్రారంభించాడు. త్రీడీ నిట్టింగ్ టెక్నాలజీని ఉపయోగించి ఈ షూస్ రూపొందిస్తున్నాడు. వీటికి 360 డిగ్రీల ఫ్లెక్సిబిలిటీ ఉండడంతోపాటు 18 మి.మీల వరకూ పెరుగుదల ఉంటుంది. అంటే కనీసం ఏడాదిపాటు ఉపయోగించవచ్చనమాట. ధర రూ. 1800-2600 మధ్య ఉంటుంది.

# ఈ వాచీలతో క్షేమం



ఢిల్లీకి చెందిన స్మృతీగోయల్ ఓరోజు తన అయిదేళ్ల చిన్నారిని తీసుకుని ఓ కార్నివాల్‌కు వెళ్లింది. రద్దీగా ఉందక్కడ. భయపడుతున్నట్టే కాసేపటి తర్వాత చేయిపట్టు తప్పి చిన్నారి కనిపించలేదు. అది రెండు నిమిషాలే..అంతలోనే ప్రపంచం తలకిందులైనట్లయిందామెకు. 'చిన్నారి కనిపించింది సరే ఒకవేళ కనిపించకపోతే పరిస్థితి ఏంటన్న' ఆలోచన ఆమెను ఆందోళనకు గురిచేసేది. దేశంలో సగటున ఎనిమిది నిమిషాలకో చిన్నారి తప్పిపోతున్నట్టు నేషనల్ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా లెక్కలు చెబుతున్నాయి. 'మాకు ఇద్దరు అమ్మాయిలు. తర్వాత నుంచి వారిని చూసినప్పుడల్లా పిల్లల ఆచూకీ, భద్రత కోసం సాంకేతికతని ఉపయోగించి ఏదైనా చేయాలనుకున్నాం' అంటారు స్మృతి. తర్వాత తన భర్త అమిత్‌తో కలిసి 'సెక్యో' అనే స్మార్ట్‌వాచ్‌ని తీసుకొచ్చారు. జీపీఎస్, లొకేషన్ ట్రాకింగ్ సదుపాయం దీన్లో ఉంది. దీనిద్వారా పిల్లలు ఎప్పుడు ఎక్కడ ఉన్నారో తెలుసుకోవచ్చు. అంతేకాదు వారితో సంభాషించవచ్చు కూడా. దీన్లో ప్రత్యేక సిమ్ ఉంటుంది. తల్లిదండ్రుల ఫోన్లో ఆప్ ద్వారా సిమ్ పనిచేస్తుంది. ఈ స్మార్ వాచ్ ఫోన్‌లానూ పనిచేస్తుంది. లొకేషన్ ట్రాకింగ్, వాయిస్ కాల్ (ముగ్గురికి మాత్రమే), స్కూల్ మోడ్, అత్యవసర (ఎస్ఓఎస్) బటన్ ఉంటాయి. ధర పెరిగే కొద్దీ వీడియోకాల్ లాంటి మరికొన్ని ఫీచర్లూ తోడవుతాయి.


# హాని చేయని రంగులు

హాని చేయని రంగులు పిల్లలకు కాస్త ఊహ వస్తే పెన్సిళ్లు, క్రేయాన్లు, పెయింట్లతో ఆటలు మొదలు పెడతారు. వాటిలో చాలా వరకూ రసాయనాలతో చేసినవే. అవెక్కడ నోట్లో పెట్టుకుంటారోనని అనుక్షణం భయమే. ఈతరం తల్లిదండ్రులకు ఆ ఆందోళన అవసరం లేకుండా సహజమైన రంగులూ, నూనెలతో ఉత్పత్తుల్ని తెస్తోంది బెంగళూరుకు చెందిన 'డెబుల్'. నేహా బజాజ్, కరెన్ సల్దాన్హా దీని వ్యవస్థాపకులు. కరెన్ కార్పొరేట్ ఉద్యోగం చేయగా, నేహా యాడ్ ఫొటోగ్రాఫర్. ఇద్దరూ ఓ పెయింటింగ్ శిక్షణ కార్యక్రమంలో పరిచయమయ్యారు. పిల్లల కోసం పర్యావరణహితమైన ఉత్పత్తుల్ని విదేశాల నుంచి తెప్పించుకునే వారు. ఆ విషయంపైన చర్చించుకుంటున్నప్పుడే అలాంటివాటిని ఇండియాలోనే తయారు చేయాలన్న ఆలోచన వచ్చింది. 2017 నుండి ఫుడ్ టెక్నాలజిస్టులు, కెమిస్టుల సాయంతో వివిధ ఉత్పత్తులు అభివృద్ధిచేశారు. 2019 నుంచి మార్కెటింగ్ మొదలుపెట్టారు. ముడిపదార్థాల వివరాల్ని ప్యాక్ మీద అందిస్తూ తల్లిదండ్రులకు నమ్మకం కలిగిస్తున్నారు.



వీరి ఉత్పత్తుల్లో సహజమైనం, నూనెలూ, రంగులతో చేసిన ఫింగర్ పెయింట్స్, క్రేయాన్స్, బ్రష్‌లు, మౌల్డ్‌లు, ఆర్ట్‌కిట్స్ మొదలైనవి ఉంటాయి. ఇవన్నీ ఆరేళ్లలోపు పిల్లలకోసం ఉద్దేశించినవే. ప్లే ఆర్ట్ విభాగంలో వచ్చే క్రేయాన్లు జంతువులూ, కార్ల ఆకారాల్లో వస్తాయి. ఐఐఎమ్ బెంగళూరులో ఇంక్యుబేషన్‌కూ ఎంపికైంది డెబుల్. కర్ణాటక ప్రభుత్వం నుంచి రూ.25 లక్షల గ్రాంటునీ పొందారు వీళ్లు. ఆకర్షణీయమైన ఉత్పత్తులు తెస్తూ పిల్లల స్క్రీన్ టైమ్ తగ్గించడమే తమ లక్ష్యమని చెబుతున్నారు నేహా, కరెన్‌లు.





కథ

# కనిపించిన దేవుడు

**ఆరేళ్ల** కిట్టూ అల్లరి పిల్లాడే కాదు. చాలా తెలివిగల పిల్లాడు కూడా. అమ్మా, నాన్నా, తాతయ్య, బామ్మ, చిన్న చెల్లి..ఇది వాడి కుటుంబం. వాడికి వాడి కుటుంబ సభ్యులంటే చాలా కష్టం. కానీ అందరికన్నా అమ్మన్నా, తాతన్నా ఇంకొంచెం ఇష్టం. తనకి అన్నీ చేసేది, ఏం కావాలంటే అది ఇచ్చేది అమ్మే కదా. తాతామో చాలా కబుర్లు చెప్తాడు. రోజు కథలు చెప్తాడు. తనకే కాదు, తన స్నేహితులకి కూడా బోలెడు కథలు చెప్తాడు. అలా కథలు చెప్పే తాతలు వాళ్లకి లేరుగా. అందుకే తనకి తాతయ్య అంటే ఇష్టం. కిట్టూ రోజు తాత సంధ్య వార్చటం చూస్తూ వుంటాడు. పొద్దున్న, సాయంత్రం, ధోవతి కట్టుకుని, పీట వేసుకుని వరండాలో కూర్చుంటాడు. ముందు ఒక పళ్లెం (పరివేణం), గ్లాసులో (పంచపాత్ర) నీళ్లు, చెంచా (ఉద్ధరిణ) వుంటాయి. ఆ నీళ్ల కొన్ని పోస్తూ, కొన్నిసార్లు నెత్తిన చల్లుకుంటూ బోంబోం అంటూ ఏమిటో చాలా చెప్పున్నట్లు పెదాలు కదిలిస్తూ వుంటాడు. మధ్యాహ్నం కూడా చేస్తానని తాత చెప్తాడుగానీ, తను స్కూలుకి వెళ్తాడు కదా, తను చూడడు. తాత దేవుడికి పూజ చేస్తే దేవుడు బోలెడు తెలివితేటలు, బలం ఇస్తాడని అమ్మ చెప్పింది.

మరి దేవుడు గూట్లో వున్నాడు కదా, తాత ఇక్కడెందుకు చేస్తున్నాడంటే, దేవుడు గూట్లోనే కాదు, ఎక్కడబడితే అక్కడే వుంటాడు. ఆకాశంలో కనబడే సూర్యుడు కూడా దేవుడే అన్నది అమ్మ. దేవుడు ఎక్కడబడితే అక్కడుంటే అందరికీ అడ్డురాడు, దేవుడు అందరికీ కనబడేటట్లు వుండడు. నువ్వింకా పెద్దయితే తెలుస్తుందిలే. అప్పటిదాకా ఆ గూట్లో దేవుడికి దణ్ణం పెట్టు చాలు అంది.

వాడికీ తాతలా పూజ చెయ్యాలని కోరిక. ఒకసారి తన చిన్న పీట, ఒక పళ్లెం, గ్లాసు తెచ్చుకుని, చొక్కా విప్పేసి, తాత పక్కన కూర్చుని తాత ఎలా చేస్తే అలాగే చెయ్యటం మొదలుపెట్టాడు. అది చూసి అంతా నవ్వారు. అమ్మ మురిసిపోయి, ముద్దు పెట్టింది. నాన్నయితే చాలా ఫొటోలు, వీడియోలు తీసి తర్వాత అందరికీ చూపించాడు. తను అచ్చం తాతలాగానే చేశాడు. అంతే, రోజూ తనూ తాతలా చెయ్యాలనుకున్నాడు కానీ పొద్దునే నిద్ర లేవటం కష్టం. తర్వాత స్కూలుకి తయారవ్వాలి. స్నేహితులతో ఆడుకోవాలి కదా. అందుకే, తాత చెప్పినట్లు తను కొంచెం పెద్దయేక చేద్దాంలే అని ఆపేశాడు.

ఒకరోజు బామ్మ, తాతా ఊరెళ్లారు. అమ్మా, నాన్నా ఎవరి పనులతో వాళ్లు సతమతమవుతున్నారు. దానికి తోడు చెల్లి ఏడుపు. అందుకని రోజూ తాత చేసే పూజ తను చేద్దామనుకున్నాడు కిట్టూ. స్నానం చేసి, తువ్వాలు చుట్టుకుని వచ్చాడు. తలుపు తీసి, కిందటి రోజు పెట్టిన పూలన్నీ తీసి ఒక పళ్లెంలో వేశాడు, చేతులు కనుక్కుని, ఒక అరటి పండు తీసుకువచ్చి దేవుడు ముందు పెట్టాడు. ఇంక ప్రార్థన మొదలుపెట్టాడు.

'దేవుడూ, నువ్వు చాలా మంచివాడివట. అడిగినవన్నీ ఇస్తావుట. ఇవాళ తాత ఊళ్లో లేడు. అందుకే నేను అరటిపండు పెట్టాను. మొత్తం తినెయ్యి. కింద పడకుండా తినేం!? మరేమో, తాతా, బామ్మా ఊరెళ్లారుగా, రేపొచ్చేస్తారులే. వాళ్ల నాన్న రోజు ఆఫీసుకెళ్లి బోలెడు డబ్బులు తెచ్చేటట్లు చూడు. మరి నాకు బోలెడు చాక్లెట్లు కావాలి కదా. అమ్మకి ఆఫీసు పని రోజు కొంచెం తక్కువగా వుండేటట్లు చూడు. మరి ఇంట్లో మాకు అన్నం వండి పెట్టాలి కదా. చెల్లి పెద్దయితే పర్వాలేదు. అప్పటిదాకా అది ఏడవకుండా చూడు. మా స్నేహితులంతా బాగుండేటట్లు చూడు. ఎవరికీ జరాలు రానీకు. మరి మేమంతా ఆడుకోవాలి కదా. అన్నట్టు దేవుడు, అందరినీ చూస్తూ నువ్వు అరటిపండు తినడం మర్చిపోకు. మరి అందర్నీ చూడాలంటే నీకు బోలెడు బలం కావాలి కదా!'

కిట్టూ ప్రార్థనలు విన్న అమ్మా, నాన్నలకి దేవుడక్కడే కనిపించారు.

**- పి.యస్.యమ్.లక్ష్మి**







వార్త ఆదివారం

## బాలగేయం

### మా బడి



బడిగంటలు మోగాయి
కొత్త యూనీఫామ్
కొత్త పుస్తకాలు
కొత్త బూట్లు
కొత్త స్కూలు
అన్నీ కొత్తకొత్తగానే
వున్నాయ్
అమ్మ చేయిపట్టుకుని
బడిలో వదిలేసింది
ఆయమ్మ ఏడవకంది
టీచరమ్మ బుద్ధిగా
చదువుకోమంది
స్నేహితులేమో
చాక్‌లేట్ ఇచ్చారు
అందరం ఆడుకున్నాం
చదువుకున్నాం
ఇంటికొచ్చాం
మా బడి భలేగా ఉంది
రోజూ వెళ్లి
బుద్ధిగా చదువుకుంటాం
పెద్దలకు లోబడి
జీవిస్తాం..

- సండే డెస్క్

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- సి.కార్తిక్,** హనుమకొండ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వాతావరణంలోని నీటిఆవిరి భూమి మీదకు ఎలా చేరుతుంది?**

**జవాబు: కార్తిక్!** వాతావరణంలో అదృశ్యంగా ఉన్న నీటి ఆవిరిని 'ఆర్ద్రత' అంటారు. నీరు ఆవిరిగా మారి, నీటి ఆవిరి అవుతుంది. ఈ నీటి ఆవిరి నీరు లేదా మంచుగా మారటాన్ని 'ద్రవీభవనమని' అంటారు. నీటి తుంపరల పరిమాణం, బరువు పెరిగినప్పుడు గాలికి ఈ తుంపరలను భరించే శక్తి లేక తేమ రూపంలో భూమి మీద పడటాన్ని 'అవపాతం' అంటారు. అవపాతం, వర్షం, మంచు, పొగమంచు లేదా వడగళ్ల రూపంలో ఉంటుంది. మేఘాల నుంచి పెద్ద పెద్ద చుక్కలుగా నీరు పడటాన్ని 'వర్షం' అంటారు. దీనిని వర్షపుమాపకంతో కొలుస్తారు.

**- కె.ప్రభాకర్,** కాకినాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నిద్ర ఎందుకు వస్తుంది?**

**జవాబు: ప్రభాకర్!** నిద్ర ఎందుకు వస్తుందనేదానికి సమాధానంగా శాస్త్రవేత్తలు ఎవరికి తోచిన సిద్ధాంతాలను వారు ప్రతిపాదించారు. వాస్తవానికి నిద్ర అనేది ఒక మిస్టరీ. గతంలో మెదడు చురుకుగా ఉన్నప్పుడు మనం మేల్కొని వుంటామని, మెదడు క్రియాశీలత తగ్గినప్పుడు మనం నిద్ర పోతుంటామని భావించేవారు. కానీ ఇది నిజం కాదు. మెలకువగా ఉన్నప్పుడూ, నిద్రా సమయంలో కూడా మన మెదడు చురుకుగా తన పని తాను చేసుకుంటూనే ఉంటుందని, నిద్రను మెదడు లోని కొన్ని భాగాలు నియంత్రిస్తుంటాయని పరిశోధనల ద్వారా తేలింది. మన శరీరం రోజంతా ఏదో ఒక పని చేసిన కారణంగా తరిగిపోయిన శక్తి నిల్వలను నిద్రా సమయంలో పూడ్చుకునే ప్రయత్నం చేస్తుంది. దెబ్బతిన్న కండర కణజాలాన్ని కూడా నిద్రా సమయంలోనే చిన్నపాటి మరమ్మత్తు చేసుకుంటుంది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే మన మానసిక శక్తి కూడా నిద్రలోనే సమకూరుతుంది.

# ఆకుపచ్చ గోడ అందాలు

**మీరు ఎన్నైనా చెప్పండి. ప్రకృతికి మించిన అందం మరొకటి లేదు. ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోవాలంటే మళ్లీ పచ్చదనంవైపుకు పరుగులు తీయాల్సిందే. అందులో నుంచి పుట్టినవే ఈ గ్రీన్‌వాల్స్.**



ఇంటివారి అభిరుచికి నిలువెత్తు నిదర్శనమే ఇంటీరియల్ డిజైన్ అంటారు. అది వాళ్ల జీవనశైలిని చెప్పకనే చెబుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ తమ ఇంటిని ఉన్నంతలో అందంగా అలంకరించుకోవాలి అనుకుంటారు. అయితే ఈమధ్య ధరించే దుస్తులూ వేసుకునే నగల్లో రోజుకో రకం ఫ్యాషన్ పుట్టుకొస్తున్నట్లే ఇంటీరియల్ డిజైనింగ్‌లోనూ కొత్త ట్రెండ్స్ వస్తున్నాయి. ఈ పచ్చని చిత్రాలూ గోడలూ అలా వచ్చినవే. అలాగని ఈ గోడ మొక్కల్ని పెంచడానికి మట్టి అవసరం లేదు. నీళ్లు అంతకన్నా అక్కర్లేదు. రెండు నుంచి ఎనిమిదేళ్ల వరకూ చెక్కుచెదరకుండా వాడిపోకుండా కనువిందు చేస్తుంటాయి. అందుకే ఆధునిక ఇంటీరియల్ డిజైనర్లు ఈ సరికొత్త గ్రీన్‌వాల్స్‌తో ఇంటికి నయా లుక్‌ని తీసుకొస్తున్నారు. పచ్చదనాన్ని ఇష్టపడే వాళ్లు సాధారణంగా బాల్కనీలోనూ పెరట్లోనూ లేదా ఇంటిలోపలా కుండీల్లో మొక్కల్ని పెంచుకుంటుంటారు. అందం, ఆహ్లాదంతోపాటు చల్లదనాన్నీ పంచిస్తాయవి. అయితే ఆసక్తి ఉన్నా అంత ఓపికా తీరికా లేకపోవడంతో చాలామంది పెంచుకోలేరు. దాంతో కొందరు సహజ మొక్కల్ని తలపించే ప్లాస్టిక్కునే తెచ్చిపెట్టుకుంటున్నారు. కానీ ఇరుకిరుకు ప్లాట్స్‌లో అవైనా ఎన్ని కుండీలని పెట్టుకోగలరు..ఏదో ఒకటో రెండో తప్ప. అందుకే గోడకే పచ్చని మొక్కలు ఉంటే ఎంత బాగుంటుందో అన్న ఆలోచన వచ్చినట్లుందో డిజైనర్‌కి. అదే క్రమేణా అంతటా పాకింది. పైగా ఆరుబయట ఎంత పచ్చదనం ఉన్నా అక్కడ ఎక్కువసేపు గడపలేం.



టీవీ చూస్తూనో భోజనం చేస్తూనో హాల్లోనే ఎక్కువగా గడుపుతాం. అందుకే ఆ పచ్చని ప్రకృతిని నట్టింట్లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నమాట. టీవీ క్యాబినెట్ వెనకో, డిజైనింగ్‌కి ముందో, పడకగది గోడకో ఇలా తమకి ఇంట్లో నచ్చేచోట ఈ పచ్చని నాచు గోడల్ని (గ్రీన్‌హౌస్‌వాల్)ని అలంకరిస్తున్నారు. వీటినే బయోఫిలిక వాల్స్ అంటున్నారు. నిజానికి గ్రీన్ వాల్స్ మరీ కొత్తవేం కాదు, కార్పొరేట్ భవంతుల్లో గోడలకు ఫ్రేమ్స్‌ని అమర్చి, మొక్కల్ని పెంచడం చూస్తుంటాం. అలా పెంచడం అందరికీ సాధ్యం కాదు కాబట్టి ఇప్పుడు వాటికి బదులుగా వాడిపోని మాస్ గోడల్నీ లేదా చిత్రాల్ని అలంకరిస్తున్నారన్నమాట.









## అద్భుతమైన కళ 'నాచు'

ఇందుకోసం ముందుగా గోడ మీద ఏ మేరకు కావాలో అంతవరకూ బెండుతో ఓ బోర్డుని తయారుచేస్తారు. దానిమీద పీట్ మాస్ (ఒకరకమైన నాచు)ని ఓ పొరలా అతికించుకుంటూ వస్తారు. ఆపై రకరకాల నాచు మొక్కల్నీ కాడల్నీ బెరడునీ అతికించుకుంటూ డిజైన్ చేస్తారన్నమాట. మరి ఆ నాచు చనిపోకుండా ఉండాలంటే కొంచెం నీళ్ల కాస్త ఎండ కావాలి కదా అనిపించడం సహజం. కానీ ఈ గోడల మీద ఉన్న వన్నీ నిజమైన నాచు మొక్కలేగానీ వాటికి జీవం ఉందన్నమాట. అంటే పెరిగిన నాచుని తీసుకొచ్చి దాన్ని గ్లిజరిన్‌తో చర్య జరిపినప్పుడు అది ఆ మొక్కల్లోని నీటిని పీల్చుకుని అవి ఎండిపోకుండా తాజాగా ఉంచుతుంది. అందుకే అవి మట్టి లేకున్నా నీళ్ల లేకున్నా పచ్చగా కళకళలాడుతూ ఉంటాయి. ఈ మొక్కల వల్ల పురుగులూ కీటకాలూ కూడా రావు. కాబట్టి ఇవి జీరో మెయింటెనెన్స్ అన్నమాట.

## అసలేమిటీ నాచు?

భూమ్మీద పుట్టిన అత్యంత పురాతన జీవులు. బ్రయోఫైటా కుటుంబానికి చెందుతాయి. దట్టమైన అరణ్యాల్లోని చెట్లమీదా రాళ్లమీదా నాచు (మాస్) మొక్కలు ఎక్కువగా పెరుగుతాయి. వీటిల్లో 12వేలకు పైగా జాతులున్నాయి. తడి నేలమీద పెరిగే పీట్‌మాస్, చెట్ల కొమ్మలమీద పెరిగే, షీట్, రాళ్ల మీద పెరిగే మూడ్, లేత పసుపు రంగుల్లో ఉన్న ఫైర్, ఫ్లూమ్, ఆకుల్లో పెరిగే స్పూన్, ఫెర్న్..వంటి ఇలా ఎన్నో రకాల నాచులు ఉన్నాయి. డాసోనియా అనే నాచు అయితే పెద్ద మొక్కలానే 20 అంగుళాల పొడవు పెరుగుతుంది. వీటిల్లో కొన్ని రకాలు చీకటిలోనే పెరుగుతూ రత్నాల్లా మెరుస్తాయి. లేతపచ్చ గోధుమ కలగలిసిన రంగులో ఉండే కుషన్‌మాస్ చూడ్డానికి మెత్తని దిండునే తలపిస్తుంది. తడి లేకున్నా పెరిగే ఈ రకం నాచు, కరవునీ తట్టుకుంటుందట. అయితే గ్రీన్‌వాల్స్ కోసం నీటిని బాగా పీల్చుకుని పీట్‌మాస్‌నే ఎక్కువగా వాడతారు. నిజానికి దీన్ని మొక్కల పెంపకంలోనూ వాడుతుంటారు. ఇవి వాటి బరువుకన్నా 20 రెట్లు ఎక్కువ నీరు లేదా ద్రావణాన్ని గ్రహిస్తాయి. నాచుమొక్కలన్నీ కూడా మంచి ఇన్సులేటర్లే. ఇవి ఆయా ప్రాంతాల్లో వాతావరణాన్ని బట్టి అక్కడ పెరిగే చెట్లకు అవసరం మేరకు వేడినీ తేమనీ అందిస్తుంటాయి. పువ్వులు పూయని ప్రాంతాల్లో వాతావణాన్నిబట్టి అక్కడ పెరిగే చెట్లకు అవసరం మేరకు వేడినీ తేమనీ అందిస్తుంటాయి. పువ్వులు పూయని ఈ మొక్కలు స్పోర్స్ ద్వారా ప్రత్యుత్పత్తి చేసుకుంటాయి. వీటికి ఆకులూ కాండాలూ ఉంటాయికానీ వేరు వ్యవస్థ ఉండదు. అందుకే వీటిని అందమైన గోడ చిత్రాలుగానూ రూపొందించగలుగుతున్నారు. వీటి ధర చదరపు అడుగుకి ఇంతచొప్పున ఉంటుంది. అయితే కొన్ని కంపెనీలు ట్రీట్ చేయని సజీవ నాచు గోడల్నీ అమ్ముతున్నాయి. వీటికి కొంత పోషణ అవసరమే కానీ ఈ మొక్కలు గాల్లోని కలుషితాల్నీ పీల్చుకోవడంతో ఊపిరితిత్తుల సమస్యలు తగ్గుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. అది జీవం ఉందా లేదా సహజమైనదా కాదా అన్నది కాకుండా ఇంట్లో పచ్చదనం ఉంటే చాలు అనుకునేవాళ్లు ప్లాస్టిక్ నాచు లేదా మొక్కలతో అల్లిన గోడల్నీ తెచ్చిపెట్టుకుంటున్నారు. వీటిల్లోనూ బోలెడు రకాలు అచ్చంగా గడ్డితో కొన్ని ఉంటే, ఆ గ్రాస్‌కి చిన్నచిన్న మొక్కల్ని జతచేసి అమర్చినవి మరికొన్ని. ఈ రెండూ కాకుండా రకరకాల ఫెర్న్, కాక్టస్, క్రోటన్ మొక్కల్ని మేళవించి చేసిన గోడలూ వస్తున్నాయి. గడ్డితో చేసిన గోడలకి గోల్ఫ్ మైదానాల కోసం పాలియెస్టర్ ఫైబర్‌తో చేసిన ఆస్ట్రో టర్ఫ్‌నే వాడటంతో అది చూడ్డానికి సహజ గడ్డిలానే కనిపిస్తుంది. ఎక్కువకాలం మన్నుతుంది. కాబట్టి గోడే అక్కర్లేదు, గ్రీన్‌వాల్ కావాలను కున్నవాళ్లు ఇలా కృత్రిమ మొక్కలతో చేసిన గోడని డిజైన్ చేయించుకోవచ్చన మాట. కొందరైతే ఏ స్పాలోనో స్నానం చేస్తున్న ఫీల్ కలగడం కోసం అన్నట్లు మాస్‌టైల్స్‌ను బాత్‌రూమ్ గోడలకీ అలంకరిస్తున్నారు. ఎందుకంటే పచ్చని గోడలు కేవలం అందంకోసమే కాదు. ఏదో ఒకరకంగా ఇంట్లో పచ్చదనం పరచుకోవడం వల్ల ఇంట్లోని సభ్యులు ఆరోగ్యంగానూ ఆనందంగానూ ఉంటున్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. కుటుంబ సమస్యలూ తక్కువగా ఉంటున్నాయట. నాచుగోడలవల్ల గాల్లో నాణ్యత పెరుగుతున్నట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థా పేర్కొంటోంది. టెక్సాస్ ఏ అండ్ ఎమ్ కాలేజీ నిపుణులయితే ఆఫీసుల్లో పచ్చని వాతావరణం ఉంచినప్పుడు ఉద్యోగుల పనితీరు మెరుగైనట్లు తమ పరిశీలనలో తేలిందని చెబుతున్నారు. కాసేపు అలా పచ్చదనాన్ని దీక్షగా చూస్తే కంటిసమస్యలూ ఉండవని యోగశాస్త్రం చెబుతుంది. కాబట్టి కాంక్రీటు జంగిల్స్‌లో పచ్చదనం కోసం ఎక్కడికో పరుగులు తీయకుండా ఇంట్లోని గోడల్నే పచ్చగా కళకళలాడేలా అలంకరిస్తున్నారు.



కథ

# రారండోయ్ వేడుక చూద్దాం!

ఎనుగంటి వేణుగోపాల్

"హలో! నేను జయరాంనండి"

బదులుగా హలో అనకుండానే "చెప్పండి" నిర్లక్ష్యంగా అవతలి గొంతు.

"పెళ్లిళ్ల పేరయ్య శాస్త్రి మీ సంబంధం గురించి కబురు అందించాడు. మా గురించి వివరాలు మీకూ అందించానన్నాడు. అబ్బాయి చి॥ కుబేర సౌభాగ్యవంతుడు నీరజ్ తండ్రిని!"

"కాస్త బిజీగా ఉన్నానండీ! సాయంత్రం ఓసారి గుర్తు చేయండి" మాటలు ప్లీజెంట్‌గానే ఉన్నా ఆడపిల్ల తండ్రిని అనే అహం గొంతులో ధ్వనిస్తోంది.

ఆ మాటతోనే ఫోన్ కట్ అయింది.

ఉసూరుమన్నాడు జయరాం. ఆడపిల్ల తండ్రినని అంత టెక్కు! మగపిల్లవాడి తండ్రినని నా పట్ల ఎంత చిన్నచూపు!

మొన్నటికి మొన్న ఇలాగే మ్యారేజీ బ్యూరోలో ఫొటో నచ్చిందని అమ్మాయి పేరెంట్స్‌కి ఫోన్ చేస్తే వాళ్ల అడిగిన మొట్టమొదటి ప్రశ్న.

"మీకు ఎన్ని కోట్ల ఆస్తి ఉంది?" అని.

జయరాం బిత్తరపోయాడు.

"కోట్లు కాదు కదా! లక్షల ఆస్తి కూడా లేదు. కానీ పిల్లవాడు లక్షణంగా ఉంటాడు. మంచి ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వెలగబెడుతున్నాడు" అని మాత్రం సమాధానం ఇవ్వగలిగాడు.


జయరాంది ప్రభుత్వ ఉద్యోగం. వారసత్వంగా వచ్చిన రెండు గుంటల ప్లాట్‌లో వాయిదాల వారిగా ఒక ఇల్లు అయిందనిపించాడు.

అప్పటికే ఉద్యోగపు సంధ్యాసమయం దగ్గర పడింది. రిటైర్ కంటే ముందే కొడుకు పెళ్లి చేసేయాలని అతడిడి తపన.

ఉన్న ఒక్క కొడుకును బీటెక్ వరకు చదివించేసరికి దాచుకున్న జీతంరాళ్లు కాస్త హారతి కర్పూరంలా కరిగిపోయాయి.

"వధువు తల్లిదండ్రులేమో కొండెక్కి కూర్చుంటున్నారీమధ్య, ఏం కాలమో ఏమో? ఇంతలేసి డిమాండ్స్.. డిమాండ్ చేస్తుంటే మా లాంటి మధ్యతరగతి కుటుంబాల మగపిల్లల పెళ్లిళ్లు ఎప్పటికి అయ్యేను?" నిట్టూర్చాడు జయరాం.

ఫోన్లతో ఇక లాభం లేదని వీలు చూసుకొని ఒకరోజు పేరయ్యశాస్త్రి ఇంటికి స్వయంగా బయల్దేరాడు జయరాం.



ఇంట్లోకి అడుగు పెడుతూనే "ఏమండీ, శాస్త్రులూ! ఈ జన్మలో మా వాడికి వివాహం జరిగేనా? ఏదైనా సంబంధం కుదిర్చేది ఉందా, లేదా?" చిరుకోపంతో ప్రశ్నించాడు జయరాం.

"ఆ పని మీదే ఉన్నాను కదండీ! పైగా పిల్లవాడికి ఎలాంటి గ్రహాల అడ్డంకీ లేదండీ! లగ్న ఘడియలు భేషుగ్గా ఉన్నాయి" అన్నాడాయన నవ్వుతూ.

"మరి ఒక్క సంబంధం కనీసం దరిదాపులదాకా కూడా రావడం లేదే?" నిట్టూర్చాడు జయరాం.

"మీరూ భేషుగ్గా ఒక ఆడపిల్లని కంటే ఇంతలా బాధపడేవారు కాదు కదా! కాలు మీద కాలు వేసుకుని మహారాజులా భేషుగ్గా కూర్చుంటే అబ్బాయివాళ్లే ఈ ఇంటి చుట్టూ గ్రహాల్లా తిరిగేవారు కాదూ?"

"ఈ వయసులో మళ్లీ నేను ఆడపిల్లను కనాలంటారా?" జయరాం కోపంగా చూశాడు శాస్త్రులు వంక.

"అయ్యో? అపచారం! అపచారం! నా ఉద్దేశం ఎంతమాత్రం అది కాదండీ! ఇప్పుడీ హైటెక్ కాలంలో మగ సంబంధాల పరిస్థితి అలా దాపురించింది. ఎవరేం చేస్తారు చెప్పండి?"

"జరగనిదాని గురించి అనవసరపు ఆలోచనలెందుకు దండగ? జరగబోయేది చూడండి. ఇంతకీ ఆ పూదూరు సంబంధం ఏమైంది?"

"భేషుగ్గా అడిగేసానండీ! ఏదో ఒకటి తేల్చండని వదలకుండా పట్టు పట్టాను".

"ఏమన్నారు?"

"పెద్దగా వాళ్లేం గొంతెమ్మ కోరికలు కోరడం లేదండీ! ప్రస్తుతం నడుస్తున్న ట్రెండునే భేషుగ్గా మన ముందుంచారు"

"ట్రెండేంటండీ ట్రెండు? ఇవన్నీ మనం గీచుకుంటున్న వలయాలు కాదూ? అయినా మగపిల్లవాడిని కన్నాక తప్పుతుందా? చెప్పండి!" అంటూ కాస్త తగ్గాడు జయరాం.

**అంగీకారంగా "దాందేముందండీ! ఈ రోజుల్లో ఇవన్నీ సహజమే కదా! పర్వాలేదు. మనందరి ముందు అమ్మాయికి ఏమైనా అభ్యంతరం అనిపిస్తే అబ్బాయిని ఒక పక్కగా తీసుకెళ్లమనండి" సలహా ఇచ్చాడు జయరాం.**

"క్యూట్‌గా.. భేషుగ్గా.. అబ్బాయి ఆరడుగుల పొడగరై ఉండాలట.."

"ఏం? వాళ్ల అమ్మాయి ఏడడుగులు ఉంటుందటనా?" ఒళ్లు మండింది జయరాంకి.

"ఇక ఒంటి రంగు పాల తెలుపు సరేసరి!"

"అమ్మాయి కాకి నలుపేమో? ఈడు జోడూ బాగా కుదరాలనేమో?"

"నెలకు జీతం రెండు లక్షలకి తగ్గకూడదట. కోట్ల ఆస్తి డిటో డిటో! భేషుగ్గా మినిమం మూడు కోట్ల స్థిరాస్తి ఉంటే అడ్జస్ట్ అవుతారట"

వింటున్న జయరాం గుండె చిల్లు పడింది.

బదులు ఇవ్వకుండా ఆలోచనలో పడిన జయరాంని "ఏం చెప్పమంటారు?" అంటూ కదిపాడు శాస్త్రులు.

బదులుగా "చెప్పడానికి ఏముంది శాస్త్రులూ? ఈ సంబంధమూ పోయినట్టేగా!" అని అంటూ ఇంటిముఖం పట్టేశాడు జయరాం.

ఇంటికి వచ్చిన భర్తకి మంచినీళ్ల గ్లాసందించిన వేదవతి పక్కనే కూర్చుంటూ "ఏం జరిగింది అలా ఉన్నారు?" అంటూ కదిపింది.

పేరయ్యశాస్త్రితో జరిగిన సంభాషణ వివరంగా భార్యతో ప్రస్తావించాడు జయరాం.

నోటికి అరచేయి అడ్డం పెట్టుకొని ఫకాలున నవ్వింది వేదవతి. అకారణంగా ఎందుకలా నవ్వుతుందో అర్థం కాలేదు జయరాంకి.

ఒళ్లు మండిన జయరాం "ఏం వేళాకోళంగా ఉందా?" అంటూ చిరాగ్గా చూశాడు భార్య వంక.

"అమ్మాయి లక్షణంగా ఉండాలి! చక్కదనాల చుక్కను తలపించేలా ముద్దుగా ఉండాలి. ఇక కట్నమా? మూడు లకారాలకి దిగేది లేదు. ప్రత్యేకంగా చెప్పేదేముంది?"

పెట్టిపోతలు వగైరాలు ఉండనే ఉంటాయంటూ" ఆ రోజు ఇలాగే మీ నాన్న భీష్మించుకూర్చోలేదూ?" అంటూ ఓరగా భర్త వంక చూసింది వేదవతి, ఆయన రియాక్షన్ కోసం.

"ఇప్పుడివన్నీ అవసరమా?" చికాకుగా మొహం పెట్టాడు.

వదిలిపెట్టకుండా "అలా అని ఆనాడు ఆయన మాట నెగ్గిందా అంటే అదీ లేదు. ఆయన పెట్టిన కండిషన్లకు అసలా పది ఊర్ల పెట్టు.. అమ్మాయిల తండ్రులు మీ వైపు తొంగిచూడనే లేదట.

మీ తండ్రిగారి గొంతెమ్మ కోరికలకు భయపడి ఎవరూ పిల్లనిస్తామని ముందుకు రాలేదట. మా నాన్న మా అమ్మతో చెబుతుండగా విన్నాను. ఇవన్నీ చివరికి ఏమీ ఇచ్చుకోని నేను మీకు ముడిపడ్డాను" అంది చిరునవ్వుతో.

ఆ సమయంలో వేదవతి పాత విషయాలు ప్రస్తావనకు తెస్తుంటే జయరాంకి కాస్త ఇబ్బందిగా అనిపించింది.

"పోనీ కాలం మారి, అమ్మాయి తరపువాళ్లే పెత్తనం చెలాయిస్తున్నా, వెంటనే అమ్మాయిల్ని చేసుకోవడానికి అంత ఈజీగా ఎవరూ ముందుకు రావడం లేదు కదా!" అన్నాడు జయరాం.

పైగా "అప్పుడేమో నాకలా అనివార్యంగా ఆలస్యం అయ్యింది. ఇప్పుడు వీడికేమో నూటొక్క కారణాలతో ఏ ఒక్క సంబంధమూ ముడిపడడం లేదు" అంటూ నొచ్చుకున్నాడు.

ఎలాగైతేనేమి పేరయ్య శాస్త్రి ప్రొద్దులంతో "ఎట్టకేలకు ఒక సంబంధం పెళ్లిచూపులదాకా వచ్చింద"నే ఫోన్ కాల్ కబురు వచ్చింది జయరాంకి.

ఆ మాత్రందానికే కొడుకు పెళ్లి అయిపోయిందన్నంత ఇదిగా బోలెడంత సంబరపడిపోయాడు.

ఒక మంచి రోజు చూసుకొని అమ్మాయివాళ్ల ఇంటికి వెళ్లారు. వాళ్ల మర్యాదలు అవీ చూసి సాంప్రదాయమైన కుటుంబమే అనుకున్నారు జయరాం దంపతులు.

"మా అమ్మాయి కొన్ని సందేహాలు నివృత్తి చేసుకుంటుందట. మీకేమీ అభ్యంతరం లేదు కదా! జయరాం గారూ!" అభ్యర్థనగా అడిగాడు పిల్లతండ్రి మధుసూదనం.

అంగీకారంగా "దాందేముందండీ! ఈ రోజుల్లో ఇవన్నీ సహజమే కదా! పర్వాలేదు. మనందరి ముందు అమ్మాయికి ఏమైనా అభ్యంతరం అనిపిస్తే అబ్బాయిని ఒక పక్కగా తీసుకెళ్లమనండి" సలహా ఇచ్చాడు జయరాం.

"అయ్యో! అబ్బాయిని కాదండీ! మా అమ్మాయి మీ నుండే కొంత సమాచారం తెలుసుకుంటుందట" చల్లగా చెప్పాడు మధుసూదనం.

పచ్చి వెలక్కాయ కాదు, ఏకంగా పనసపండు గొంతులో పడ్డట్టు కాసేపు నోట మాట రాక నిశ్చేష్టుడయ్యాడు జయరాం.

"పేరున్న కాన్వెంట్ స్కూల్లో పిల్లవాడికి సీటు కావాలంటే ముందుగా పేరెంట్స్, స్కూల్ ఇంటర్వ్యూని ఫేస్ చేయాలని" అప్పట్లో విని ఉన్న వేదవతికి ఇదేమంత ఆశ్చర్యం అనిపించలేదు.

తండ్రీ కొడుకులిద్దరు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. చూపులతోనే తండ్రికి ధైర్యం చెప్పాడు నీరజ్.

జయరాం నుండి ఎలాంటి సమాధానం రాకపోయేసరికి "కదరదంటారా?" గుచ్చి గుచ్చి అడిగాడు మధుసూదనం.

"ఇంకేమైనా ఉందా? దొరక్క దొరక్క దొరికిన సంబంధం చేజార్చుకుంటే ఇంకేమైనా ఉందా? వాళ్లన్నది తలాడించకపోతే వీడికీజన్మలో పెళ్లవదేమో!" భయపడుతూ అలర్ట్ అయ్యాడు జయరాం.

ఒప్పందమే అన్నట్టు జయరాం తలూపుతూ, కంప్యూటర్ నాలెడ్జ్‌లో వీక్ అవ్వడం వల్లనేమో "ఆఫ్‌లైనే కదా!" అడిగాడు బెరుగ్గా.

ధైర్యం చెబుతూ "మీరంతలా కంగారు పడాల్సిందేమీ లేదు జయరాం గారూ! మా అమ్మాయి చిన్నప్పటి నుండి అంతే! ఈజీ క్వశ్చన్స్ వేస్తుంది" భరోసా ఇచ్చాడు మధుసూదనం.

తన రంగప్రవేశానికి అంతా సిద్ధమైందని భావించిన ప్రహేళిక "మీ అబ్బాయికి గుడ్ కండక్ట్ సర్టిఫికెట్ ఉందా అంకుల్?" అడిగింది అమాయకంగా.

ఇలాంటి ఉపద్రవమేదో ముంచుకు వస్తుందని జయరాం బుర్ర ముందే పసిగట్టింది. అందుకే అబ్బాయి సర్టిఫికెట్ల సరంజామా అంతా ఒక చేతి బ్యాగ్‌లో సర్దుకునే వచ్చాడు ముందస్తు జాగ్రత్తగా!

అందుకే హుషారుగా లెదర్ బ్యాగ్ జిప్ తీయబోతూ "ఉందమ్మా!" అన్నాడు టకీమని.

"మీరెందుకంతగా ఉత్సాహపడుతున్నారు అంకుల్? నేను అడిగింది స్కూల్ కండక్ట్ సర్టిఫికెట్ కాదు" అంటూ వారించింది.

"మరి?" ఈసారి కాస్త బెదిరిపోయాడు జయరాం.

"పేరెంట్స్‌గా మీరిద్దరూ గుడ్ కండక్ట్ సర్టిఫికెట్ ఇవ్వాలి. మా అబ్బాయి చాలా బుద్ధిమంతుడు, కోడలిగా ఇంట్లోకి అడుగు పెట్టిన అమ్మాయిని బాగా చూసుకుంటాడు అని.." అంటూ సరికొత్త బాంబు పేల్చింది ప్రహేళిక.

ఈ విద్దూరానికి పేరయ్యశాస్త్రితో సహా అక్కడున్న వారంతా విస్తుపోయారు.

"అలాగే వాళ్ల ఆఫీస్ బాస్ నుండి కూడా ఒక గుడ్ కండక్ట్ సర్టిఫికెట్ తేవాలి. రేపెప్పుడైనా మా వైవాహిక జీవితంలో ఒడుదుడుకులు ఎదురైతే ఆడపిల్లగా నా పక్షాన మీరంతా నిలబడాలిగా!" అంది అక్కడున్నందరి ఫేస్ బుక్ చదువుతూ.

ఇరుకున పడ్డాడు నీరజ్.

జయరాం ఇబ్బందిగా కదిలాడు.

వేదవతికి ముచ్చటేస్తోంది అమ్మాయి ధైర్యానికి, చురుకుదనానికి.

"అబ్బే! ఇప్పటికిప్పుడేం తొందరలేదు. అమ్మాయి అడుగుతున్న సర్టిఫికెట్స్ అన్నీ పెళ్లి కుదిరాక తీరిగ్గా సబ్మిట్ చేయవచ్చులెండి!" అన్నాడు మధుసూదనం, రుణగ్రస్తులకు బ్యాంకువారు అడగకుండానే రాయితీలేవో ఇచ్చినట్టు.

ఈసారి వేదవతి వైపు చూస్తూ "మీ అబ్బాయి వంట బాగా చేస్తాడా? ఆంటీ!" డైరెక్టుగా అడిగింది ప్రహేళిక.

"పాలు తోడు పెట్టడం రాదు వెధవకి! ఈ కాలంలో ఆడ, మగ అనే విభజన ఏముంటుంది? అన్ని పనులు అందరికీ రావాల్సిందే!" అనే ఉద్దేశంతో అప్పుడప్పుడు నీరజ్‌ని చిన్న చిన్న వంటింటి పనులకు పురమాయించేది వేదవతి. కొడుకుకి పనులు నేర్పబోతే "వాడికా వంటింటి పనులెందుకు ఆడపిల్లలా!" అంటూ వెనకేసుకొచ్చేవారు కదా! ఇవ్వండి సమాధానం తిక్క కుదిరింది అన్నట్టు భర్త వంక చూసింది వేదవతి.

ప్రశ్న భార్యదే అయినా తప్పదన్నట్టు, తాను కలుగజేసుకున్నాడు భార్య చూపులను పసిగట్టిన జయరాం.

సమాధానం ఏమివ్వాలో అర్థమవక "బాగా అంటే.." ఇబ్బందిగా నసిగాడు జయరాం. మాటను అందుకుంటూ "చేయడం వచ్చమ్మా! పెళ్లి అయ్యేలోగా ఇంకా బాగా చేసేలా నేర్పే పూచీ నాది!" అంటూ హామీ ఇచ్చింది, వేదవతి.

"పెళ్లి చేసుకోవాలంటే అబ్బాయిలకు వంట కూడా తెలిసివుండాలా?" కొత్త పాఠం చేదుగా ఉన్నా జీర్ణించుకోక తప్పడం లేదు నీరజ్‌కు.

"పూచీ కాదు ఆంటీ! ఆ సర్టిఫికెట్ కూడా ప్రొడ్యూస్ చేయాల్సి ఉంటుంది" కరాఖండిగా చెప్పేసింది ప్రహేళిక.

తలూపక తప్పలేదు వేదవతీ, జయరాం దంపతులకు.

"నేనూ జాబ్ చేస్తున్నాను కదండీ! అలాంటప్పుడు ఆడ, మగ అనే భేదం లేకుండా అన్ని పనులు సందర్భానుసారంగా భార్యాభర్తలు అన్నాక ఇద్దరూ కలిసి పంచుకుంటే ఒడిదుడుకులు ఉండవు కదా! ఆడపిల్లను అనే నెపం మీద వంటపనులన్నీ నా మీదే రుద్దకుండా ముందుజాగ్రత్త. అంతే!" అంటూ సంజాయిషీ ఇచ్చుకుంది ప్రహేళిక.

పేరయ్యశాస్త్రికి మాత్రం ఈ పెళ్లిచూపుల వ్యవహారమేదో తమాషాగా అనిపిస్తోంది. ఉలకకుండా పలకకుండా జరిగే తంతును గమనిస్తున్నాడు. మధ్య మధ్యలో ఓర చూపుతో పెళ్లికొడుకు ఫేస్ ఫీలింగ్స్ కూడా గమనిస్తున్నాడాయన.

అమ్మాయి దగ్గర నుండి ఈసారి ఎలాంటి ప్రశ్న వినాల్సి వస్తుందోనని మొహామహాలు చూసుకున్నారు తండ్రీ కొడుకులు.

"అమ్మాయి పెళ్లికి ముందే మంచి క్లారిటీతో ఉంది. పెళ్లి కాని అమ్మాయిలకు ఈ మాత్రం ఆలోచనా విధానం ఉండడం ఈ కాలానికి సబబే!" మనసులో అనుకుంటున్న వేదవతి తనకేమీ పట్టనట్టు నిబ్బరంగా ఉండిపోయింది.

ఈలోగా "మీరు అసలు తల్లిదండ్రులేనా?" హఠాత్తుగా ప్రశ్నించింది ప్రహేళిక.

ఆ మాట చెవిన పెడడం ఆలస్యం..! గజగజా వణికిపోయారు వేదవతీ జయరాం దంపతులు.

"ఇదేం ట్విస్ట్! నాకే తెలియని నా జన్మ రహస్యం ఈమె ఎలా ఛేదించిందో? ఇన్నాళ్లు నా దగ్గరెందుకు దాచిపెట్టారో మా పేరెంట్స్" పేరెంట్స్‌నే అనవసరంగా అనుమానించాడు నీరజ్.

"ఇవేం ప్రశ్నలమ్మాయి..?" అనబోయి, మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పుడో అప్డేట్ అయిన పేరయ్యశాస్త్రి గమ్మునుండిపోయాడు.

"అంటే నా ఉద్దేశం మీ అబ్బాయి సహజ జననమేనా? సరోగసీ ద్వారానా? అని. అంతే!" సస్పెన్స్ విడగొట్టి చిక్కుముడి విప్పింది ప్రహేళిక.


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.
రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్, ఆదివారం వార్త**, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

నిశ్చేష్టులయ్యారంతా.. ఏ ఒక్కరి నోటి వెంట ఒక్క మాట బయటకు వస్తే ఒట్టు!

"ముందస్తుగా అబ్బాయి పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవడంలో తప్పేమీలేదు కదండీ!" చాలా అమాయకంగా ఫేసు పెట్టింది ప్రహేళిక.

స్ట్రోకుల మీద స్ట్రోకులు వస్తున్నా "లేదు.. లేదు" అంటూ ఒకేసారి అడ్డంగా తలలూపారు వేదవతి జయరాం దంపతులు.

వైరస్ బారిన పడి ఉన్నపళంగా స్ట్రక్ అయిన కంప్యూటర్‌లా ఉంది నీరజ్ పరిస్థితి. నోరెత్తలేకపోతున్నాడు. స్థిమితంగా కూర్చోలేకపోతున్నాడు.

"అర్థమైందమ్మా! అర్థమైంది. వీడి జననం సహజమైనదే అనే బర్త్ సర్టిఫికెట్ కూడా వీలైనంత తొందరగా రెడీ చేసి పెడతాను" చాలా నిజాయితీగా ఒప్పుకున్నాడు జయరాం.

అప్పుడు కలుగజేసుకున్నాడు పెళ్లిళ్ల పేరయ్యశాస్త్రి.

"అబ్బాయిచేత ఏమైనా అడిగించమంటావా తల్లీ!" అంటూ అనుమతి కోసం ప్రహేళిక వైపు చూశాడాయన.

"అబ్బే అక్కర్లేదండీ! నేనూ ఎంచక్కా జాబ్ చేస్తున్నాను. మంచి సాలరీ! వంటొచ్చు, బైక్ రైడింగ్ చేస్తాను. బయటకు వెళ్లి అన్ని పనులూ చక్కదిద్దుకొని రాగలను. అత్తమామల్ని కంటికి రెప్పలా చూసుకోగలను" ఈ కాలపు అమ్మాయిలకు ప్రతినిధిలా చాలా కాన్ఫిడెంట్‌గా తన గురించి తాను చెప్పుకుంటున్న ప్రహేళికను చూస్తే ముచ్చటేసింది వేదవతికి.

ఇలాంటి అమ్మాయి తమ ఇంటి కోడలుగా వస్తే బాగుండు.. అనుకుంది.

ఇలా పెంచినందుకు ఆ అమ్మాయి తల్లిదండ్రుల ముఖాల పైన కనబడుతున్న ఆత్మవిశ్వాసాన్ని ఓరకంటితో గమనిస్తోంది వేదవతి.

.........

ఆరోజు ఆదివారం కావడంతో ఉదయం పది గంటలకి జయరాం ఇంటికి వేంచేశాడు పెళ్లిళ్ల పేరయ్యశాస్త్రి.

జయరాం నవ్వుతూ పలకరించాడు శాస్త్రిని.

ఇద్దరికీ కాఫీకప్పులు అందిస్తూ అక్కడే నిలబడింది వేదవతి.


కాఫీ తాగేసి కప్పు పక్కన పెడుతూ "మీ అబ్బాయి నీరజ్‌కి పిల్లని ఇస్తామంటూ భేషుగ్గా పది సంబంధాలు వెయిటింగ్! తమరు ఊ.. అనడమే తరువాయి. శుభస్య శీఘ్రం.. పెళ్లి వేడుకలు ప్రారంభం! ఏం చేద్దామంటారు?" జయరాం కళ్లలోకి తొంగిచూస్తూ ప్రశ్నించాడు శాస్త్రి.

"అనవసరంగా ఎందుకు నాన్చుతారు? ఏదో ఒకటి తెమల్చండి తొందరగా!" విసుక్కుంది వేదవతి.

"అవునండయ్యా! మీ మటుకు ఆరు నెలల నుండి దాటవేస్తున్నారు. నేనేమో చెప్పులరిగేలా తిరుగుతున్నా. సమాధానం ఇవ్వకుండా దాటవేస్తున్నారు. భేషుగ్గా ఇప్పటికైనా కాస్త మోక్షం కలిగించండి" అంటూ పెద్ద పెట్టున నవ్వాడు శాస్త్రి.

"గౌరవప్రదమైన కుటుంబం.. అబ్బాయికి మంచి ఈడు జోడుగల అమ్మాయి అయితే చాలు శాస్త్రిగారూ! మిగతా కట్నకానుకల పట్టింపేమీ లేదు. వాళ్లు సంతోషంతో అమ్మాయికి ఏమైనా పెట్టుకుంటామన్నా అది వాళ్లిష్టం. వద్దనేది లేదు!" తేల్చి చెప్పేశాడు జయరాం.

"హమ్మయ్య! మొండిమనిషి మారాడు! ఈయనగారి కండిషన్లకి అబ్బాయికీ జన్మలో పెళ్లి అవుతుందో లేదోనని భయపడి చచ్చాను, ఇన్నాళ్లకి కరుణించాడు" వేదవతి హాయిగా ఊపిరి పీల్చుకుంది.



"ఏ అమ్మవారు మీలో పూనారండీ జయరాంగారూ! సడన్‌గా ఇలా దిగి వచ్చేశారు. శుభస్య శీఘ్రం! దీన్నిబట్టి ఇప్పటివరకు మీ అబ్బాయికి వివాహానికి అడ్డంకిగా ఉన్న మీ గొంతెమ్మ కోరికల మానసిక గ్రహ బలాల అడ్డు తొలగిపోయినట్టేనని భేషుగ్గా అనిపిస్తోంది! ఇప్పుడిక మీ అబ్బాయికి ముహూర్త బలం వెరీ స్ట్రాంగ్‌గా ఉన్నట్టు తోస్తోంది" అంటూ నవ్వాడు శాస్త్రి.

భార్య వేదవతి వైపు చూసిన జయరాం వదనం ప్రసన్నం అయింది. ●

## విమానాశ్రయంలో విలేజ్ థీమ్ రిసార్ట్



ఈ ఎయిర్‌పోర్టులో విమానం దిగిన పర్యాటకులు బస కోసం బయట వెతుక్కోవలసిన అవసరం లేదు. అందులో విలేజ్ థీమ్ రిసార్ట్ ఉంది. ఇదీ థాయిలాండ్‌లోని సముయ్ విమానాశ్రయం ప్రత్యేకత. విమానం దిగిన కొన్ని క్షణాల్లో గదుల్లోకి వెళ్లిపోవచ్చు. దీనివల్ల పర్యాటకుల సమయం ఆదా అవుతుంది, శ్రమా తగ్గుతుంది. పల్లె వాతావరణంలో వున్న అనుభూతి సొంతం చేసుకోవచ్చు.

సామాన్యంగా విమానాలు రన్ వే పైన నిర్ణీత ప్రదేశంలోనే గాల్లోకి ఎగురుతాయి, ల్యాండ్ అవుతాయి. అందుకోసం ముందుగానే రన్‌వేలపై స్థలం నిర్దేశిస్తారు. అయితే రన్‌వేల మధ్య కొంత స్థలం వృథాగా ఉంటుంది. ఆ స్థలంలో కొబ్బరి, తాటి చెట్ల పల్లె వాతావరణాన్ని సృష్టించి విలేజ్ థీమ్ రిసార్ట్‌ను ఏర్పాటు చేసింది బ్యాంకాక్ ఎయిర్‌వేస్ సంస్థ. ఇంకేముంది! బ్యాంకాక్ సందర్శించడానికి వెళ్లే పర్యాటకులకు ఈ ఎయిర్‌పోర్టు సైతం ఓ పర్యాటక స్థలంగా మారిపోయింది. ●

# యుక్త వయస్సులో ఇలా ఉన్నారన్నమాట!

**ఈ ప్రపంచంలో ఎందరో ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు ఉన్నారు. వారు యుక్త వయస్సులో ఎలా ఉండేవారో తరచి చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది.**

**అదొక స్కూలు. క్లాసు జరుగుతోంది. మాస్టారు విద్యార్థులకు వ్యాకరణ పాఠం చెప్తున్నారు.**

**"అమీర్, జైతీని కొట్టాడు" అన్నారు మాస్టారు.**

అది విన్న ఓ విద్యార్థి ఉన్నట్టుండి లేచి నిల్చున్నాడు.

"ఎందుకు సార్, నిజంగానే అమీర్ జైతీని కొట్టేడా?" అని అడిగాడు.

"లేదు నాయనా, నిజంగా కొట్టలేదు. ఉదాహరణ కోసం చెప్తున్నాను. నేను చెప్పే వ్యాకరణ పాఠం మీకు అర్థం కావడం కోసం ఈ ఉదాహరణ... అంతే!" అన్నారు మాస్టారు.

వెంటనే ఆ విద్యార్థి "అయితే ఓ అబద్ధంతో ఆరంభమయ్యే ఈ చదువు నాకు అక్కర్లేదు" అని క్లాసు రూములోంచి బయటకు వచ్చేశాడు.

చూడండి.. ఓ ఉదాహరణ కోసం అబద్ధం చెప్పినా ఆ కుర్రాడు సహించలేకపోయాడు. నిజం మీద అంతటి గౌరవం, నమ్మకం ఉంచుకున్న ఆ విద్యార్థి తదనంతర కాలంలో ఓ గొప్ప మనిషిగా మారారు. ఆయన మరెవరో కాదు.. అబూబకర్ అల్ షిబ్లి.

ఇంకొక స్కూలు.. అక్కడ క్లాసు జరుగుతోంది. మాస్టారు పాఠం చెప్తున్నారు. విద్యార్థులందరూ మాస్టారు చెప్తున్న పాఠం వింటున్నారు.

ఆ సమయంలో ఉన్నట్టుండి వీధిలో ఏదో శబ్దమైంది. గోలగోల. క్షణాలు గడుస్తున్నకొద్దీ ఆ అరుపులు ఎక్కువయ్యాయి తప్ప తగ్గడం లేదు. విషయమేమిటో తెలియలేదు.

మాస్టారు చూశారు.. ఓ కుర్రాడిని పిలిచారు.

"బయట ఏదో గోల అవుతోంది. నువ్వెళ్లి చూసిరా" అని పంపించారు కుర్రాడిని.

ఆ కుర్రాడు పరుగున వెళ్లి వచ్చాకే విషయం తెలిసింది.

అదేంటంటే–

ఆ వీధిలో ఏనుగు వస్తోంది. దాన్ని చూడటం కోసమే ఆ గోలంతా.

వీధిలోకి ఏనుగు వస్తోందని తెలియడంతోనే క్లాసు రూములో ఉన్న విద్యార్థులందరిలో ఆ ఏనుగును చూడాలని ఆరాటం.

ఏనుగేమీ కొత్త కాదు. అది అప్పటికే అందరూ చూసిన జంతువే. అయినా దానిని మళ్లీ చూడాలనుకోవడం సర్వసహజం.

అంతేకాకుండా ఆ క్లాసురూములో ఉన్న విద్యార్థులలో చాలా మంది ఇప్పటివరకూ ఏనుగుని చూడలేదు.

మాస్టారు చూసారు. దేవుడి సృష్టిలో ఇదొక భారీ సృష్టి. భగవంతుడి అద్భుత సృష్టి అయిన ఈ ఏనుగుని చూడటంలో తప్పేముంది? అనుకున్నారు.

"సరేగానీ, కావాలంటే అందరూ వెళ్లి ఆ ఏనుగుని చూసి రండి" అని చెప్పారు మాస్టారు.

మాస్టారు ఆ మాట ఎప్పుడెప్పుడు చెప్తారా? అని ఎదురు చూస్తున్న విద్యార్థులు లేచి పరుగెత్తడం మొదలుపెట్టారు.

క్లాసులోని విద్యార్థులందరూ బయటకు వెళ్లిపోయారు.

అయితే ఒకే ఒక విద్యార్థి మాత్రం క్లాసురూములోనే ఉన్నచోటే ఉన్నాడు.

మాస్టారు అతని వంక చూశారు.

"ఇదేంటీ! ఈ విద్యార్థికి ఆ ఏనుగుని చూడాలని లేదా?" అనుకున్నారు.

అదే విషయం ఆ విద్యార్థిని అడిగారు "నీకు ఏనుగుని చూడాలనిపించడం లేదా?" అని ప్రశ్నించారు మాస్టారు.

దానికా విద్యార్థి నెమ్మదిగా "అయ్యా, నేను ఏనుగుని చూడటం కోసం స్కూలుకి రాలేదండి" అన్నాడు.

ఇలా చెప్పిన ఆ విద్యార్థి తర్వాతి కాలంలో యహ్యా ఇబిన్ యహ్యా అనే పెద్దాయన.

భగవంతుడి మీద భక్తి ఉన్న కొందరు పెద్దోళ్లు చిన్నప్పుడు ఎలా ఉన్నారో చూడండి. ఓ కుర్రాడు వాళ్ల నాన్నతో "నాన్నా, నాన్నా మీరు ఎంతో అదృష్టవంతులు" అన్నాడు.

"ఎందుకురా?" అని అడిగాడు తండ్రి."మీరు ఈ ఏడాది నా కోసం కొత్త కొత్త పుస్తకాలు కొనాల్సిన అవసరం లేదు. మీకు ఖర్చు తగ్గించాను" అన్నాడు.

"అంటే ఏమిట్రా?" అని అడిగాడు తండ్రి. "ఏముంది నాన్నా! ఈ ఏడాది కూడా నేను ఇప్పుడున్న క్లాసులోనే ఉంటాను" అన్నాడు. అంటే అతను ఆ ఏడాది ఫెయిలయ్యాడని వేరేగా చెప్పక్కర్లేదుగా!



**- యామిజాల జగదీశ్**


**"నా అక్షరాలు ఈ వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడపిల్లలు" - తిలక్.**

**ఎంత చక్కనైన ఊహ అది. పరికిణీలు, జాకెట్లు వేసుకొని, పెద్ద జడ, జడగంటలు, చెవులకు జూకాలు పెట్టుకొని నుదుట బొట్టు, కళ్లకు కాటుకతో అందంగా, ఆనందంగా ఉత్సాహంగా వెన్నెలలో ఆడుకొనే ఆడపిల్లలు మన కళ్లముందు కన్పిస్తారు" అంటారు 'ఒక్క క్షణం కాలాన్ని వెనక్కి తిప్పి చూస్తే' పుస్తక శీర్షికతో తన ఆత్మకథలో ప్రముఖ రచయిత్రి అడవికొలను పార్వతి.**

# అడవికొలను పార్వతి అభ్యుదయ ఆత్మకథ

తెలుగులో మహిళలు రాసిన స్వీయ చరిత్రలు అతి తక్కువ. 1977 డిసెంబరు నుంచి 1978 మే వరకు ఈ ఆత్మకథ రచనా కాలంగా, రచయిత్రి బాల్యంలో తండ్రి, స్వాతంత్ర్య సమరయోధుడు రెబ్బాప్రగడ మందేశ్వర శర్మ గారి నిస్వార్థ జీవిత విశేషాల కుటుంబ నేపథ్యం, నాటి కాలమాన పరిస్థితులు నల్గురికీ తెలియాలని స్వీయచరిత్ర రాసినట్టుగా పుస్తకంలోని 'నా మాట'లో రచయిత్రి చెప్పారు. 1952 మే 18న నాటి ఆంధ్ర సచిత్ర వారపత్రిక నిర్వహించే వనితా లోకంలో ఆమె మొదటి రచన ప్రచురితమైంది.

1931 మార్చిలో జన్మించిన ఈ రచయిత్రి, పాత కొత్తల మేలి కలయికగా నాటి సామాజిక అభ్యుదయవాదిగా ఉదయ పవనాలు (వచన కవిత), వలయంలో బానిస (కథల సంపుటి), పద్మాలు-పారిజాతాలు(కథల సంపుటి), మందారాల మాల(కథలు), అరుణ కిరణాలు(వచన కవితా సంపుటి), వ్యాస పద్మం(వ్యాస సంపుటి), రెండు తరాల స్త్రీలు, తిరగబడ్డ నవతరం(నవలలు), నీలాంబరాలు(పద్యకవిత) వివిధ సాహితీ ప్రక్రియలే కాకుండా 'ఒక్క క్షణం కాలాన్ని వెనక్కి తిప్పి చూస్తే' పేరిట భావుక మనోజ్ఞంగా, సృజనాత్మక రచయిత్రిగా ఆత్మకథ రాయడం విశేషాంశం. అడవికొలను పార్వతి రచించిన కథలన్నీ మహిళల జీవన వేదన ప్రతిబింబింపచేసినవే.




'తిరగబడ్డ నవతరం' నవలలో కట్నాలు యివ్వలేని కుటుంబాలలో వృద్ధులను పెళ్లాడిన యువతి కథనం ఉంది. రెండు తరాల జీవితాలలో నేటి యువతులు వారి మాతృమూర్తుల జీవితాల స్థితిగతులు సంప్రదాయ, నవ్య జీవన విధానాల మార్పులు చిత్రీకరించారు. తండ్రి మందేశ్వర శర్మ, సమరయోధునిగా, తూచా తప్పని గాంధేయవాదిగా జీవించిన పరిస్థితులు, వాటి ప్రభావాలు రచయిత్రి తన జీవిత చరిత్రలో వివరించారు.

పశ్చిమ గోదావరి జిల్లా గోదావరీ తీరంలోని కొవ్వూరు కార్యస్థానంగా కొండజాతి జన సంక్షేమానికి సర్వస్వం ఆరోగ్యం సహితం త్యాగం చేసిన మహోన్నత నేపథ్యం ఈ ఆత్మకథ తెలియచేస్తోంది. మందేశ్వర శర్మ తన ఆస్తిని కొంత విశాఖ ప్రాంత మాడుగుల కొండజాతికి చదువుల బళ్లు, యితర సేవా సంక్షేమ కార్యక్రమాలకు, తాను స్థాపించిన శ్రామిక ధర్మ రాజ్య సిద్ధాంత వైజ్ఞానిక ప్రచారానికి, కొంత తదితర పేద ప్రజానీక సేవలకు విల్లు రాసారు.

"నా జీవితంలో కష్టాలున్నాయి. ఆపదలు వచ్చాయి. విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్నాను. అనారోగ్యం బాధ తప్పలేదు. ఈ బాధలన్నింటికీ సాహిత్యం తోడుగా నిల్చింది" అంటారు ఈ స్వీయ చరిత్రలో రచయిత్రి.

కొవ్వూరు నుంచి పెళ్లి తర్వాత కాకినాడ, విశాఖ జీవన ప్రస్థానంలో ఆమె రచయిత్రిగా, సాహితీవేత్తగా ప్రశంసాయుతంగా కృషి కొనసాగించారు. మనుమరాలు పుట్టిన రోజులలో రచయిత్రి అమ్మమ్మగా ఆత్మకథ రాయడం 1978లో, నాలుగు దశాబ్దాల నాటి రచనగా 'ఒక్క క్షణం కాలాన్ని వెనక్కి తిప్పి చూస్తే' గుర్తింపు పొందింది.




తండ్రి మందేశ్వర శర్మ మార్క్స్, గాంధీ, శంకరాచార్య సిద్ధాంతాలని సమన్వయం చేస్తూ శ్రామిక ధర్మ రాజ్యసభ రూపొందించిన మేధా ప్రజ్ఞానిధి కావడంతో, ఈ ఆత్మకథ రచయిత్రికి ప్రాచీన, ఆధునిక సంస్కృతీ, సం ప్రదాయాల వారసత్వ విలువల వ్యక్తీకరణలతో ఆత్మకథ సాగుతుంది. నాటి స్వాతంత్ర్యోద్యమ పోరాట తుది ఘట్ట సంఘటనలు, స్వాతంత్ర్య ఉషోదయ వేకువ కాలాన్ని నాటి కుటుంబంలోను, నాటి సమాజంలోను అడవికొలను పార్వతి ప్రతిభావంతంగా తన జీవితానుభవాలతో ఈ ఆత్మకథను తీర్చిదిద్దారు. 20వ శతాబ్ది సామాజిక భావ విప్లవాన్ని అర్థం చేసుకొని జీవితాదర్శంగా రచనలు కొనసాగించిన రచయిత్రి గతాన్ని అదేపనిగా పొగడం లేదా తెగడటం చేయలేదు.

ఆమె ఆ సంధి కాలం నాటి రచయిత్రిగా, ప్రతినిధిగా తన ఆత్మకథను వినిపించారు. బాల్యంలో ఆమె వీక్షించిన చరిత్రగతి, ఉత్తేజాన్ని, ఆర్ద్రమైన అనుభూతులు ఆత్మకథలో వుండటం కారణంగా ఈ ఆత్మకథ సాహితీ పరంగా కీర్తివంతమైంది. తెలుగు సాహితీ సీమలో ఆత్మకథా రచయిత్రిగా అడవికొలను పార్వతి నేటికీ ఆధునిక సాహితీ ప్రక్రియాపరంగా ప్రభావితం చేస్తున్నారు.

**- జయసూర్య**

# మహిమాన్వితమైన క్షేత్రం 'సంగంజాగర్లమూడి'

ఆలయ దర్శనం

పృడమిలో పన్నగ భూషణుడు పలు ప్రదేశాలలో పానవట్టం మీద స్వయంభూలింగ రూపంలో వెలసి భక్తుల సేవలందుకుంటున్నారు. వాటిల్లో నదీ తీర సంగమ ప్రాంతాలలో వెలసిన స్వామిని శ్రీ సంగమేశ్వరుడు అని కీర్తిస్తారు భక్తులు.

మన రాష్ట్రంలో చాలా సంగమేశ్వర ఆలయాలు ఉన్నాయి. ఆ దేవాలయాలన్నీ విశేష భక్తాదరణ పొందుతున్నాయి. అలాంటి దివ్యక్షేత్రాలలో ఎన్నదగినది "శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ సంగమేశ్వర స్వామివారు" కోరి వెలసిన క్షేత్రం "సంగం జాగర్లమూడి".

## క్షేత్ర గాథ

బాలకృష్ణమ్మగా పిలవబడే బకింగ్‌హామ్ కాలవ తూర్పున కైలాస నాథుడు కాశీక్షేత్రం నుండి ఒక భక్తునికి సహాయపడటానికి తరలివచ్చి కొలువు తీరారని క్షేత్రగాథ తెలుపుతోంది.

చాలా శతాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో నివసించే బ్రాహ్మణ దంపతులకు గోవిందుడు అనే కుమారుడు జన్మించాడు. పుట్టుకతోనే అతను కురూపి. అతనిని అందరూ గూని గోవిందుడు అని పిలిచేవారు. శారీరక వైకల్యం గత జన్మ కర్మఫలంగా కాగా, శివభక్తి పూర్వజన్మ సుకృతంగా అతనికి లభించింది.

చిన్నతనం నుండే భక్తిశ్రద్ధలతో సర్వేశ్వరుని ఆరాధించేవాడు. కొంత కాలానికి గ్రామస్తులు తన ఆకారం గురించి చేస్తున్న విమర్శలు, వెటకారాలు, వెక్కిరింతలు తట్టుకోలేక తల్లిదండ్రుల అనుమతితో కాశీక్షేత్రం వెళ్లి విశ్వనాథుణ్ణి నియమంగా సేవించుకోసాగాడు. కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి.

అతనికి మామ వరసయ్యే ఒకాయన భార్యతో కలిసి సంతానాభిలాషతో తీర్థ యాత్రలు చేస్తూ వారణాశి చేరి మేనల్లుడిని కలిసాడు.

గోవిందుడు ఆయనతో కాశీలో ఉన్న పండితులను సంప్రదించి సంతానం కలగడానికి కావలసిన పూజలు, హోమాలు, అభిషేకాలు జరిపిస్తాను అని తెలిపాడు. అయితే అతను ఒక షరతు పెట్టాడు. శ్రీ విశ్వనాథుని కృపతో సంతానం అదీ పుత్రిక కలిగితే అతనికిచ్చి వివాహం చేయాలన్న అది.

ముందూ వెనకా ఆలోచించకుండా ఆయన విశ్వేశ్వరుని, శ్రీ భావనారాయణ సన్నిధిలో మేనల్లుడికి వాగ్దానం చేసాడు.

దైవ కృపతో ఆయన కొంత కాలానికి ఆడపిల్లకు తండ్రి అయ్యాడు. అపరిమిత ఆనందంతో ఆయన బ్రాహ్మణులకు



భారీగా సంభావనలు సమర్పించుకొన్నాడు. మేనల్లునితో "నా తీర్థ యాత్రలకు ఫలితం లభించింది. నేను మన స్వగ్రామానికి తరలివెళతాను. బాలికకు యుక్తవయస్సు వచ్చిన తరువాత కబురు పంపుతాను. పెళ్లాడటానికి తరలిరా!" అని తెలిపి కాశీ నుండి స్వగ్రామానికి వెళ్లిపోయాడు.

సంవత్సరాలు గడిచిపోయాయి. మేనమామ వద్ద నుండి ఎలాంటి సమాచారం రాకపోవడంతో గోవిందుడు తానే స్వస్థలానికి బయలుదేరాడు.

అసలు విషయం ఏమిటంటే చక్కని చుక్కగా అందాల రాశిగా ఉన్న కుమార్తెను వికలాంగుడు, వయస్సు మీద పడినవాడికి ఇచ్చి వివాహం చేయడానికి మనస్సు రాక మేనమామ మిన్నకున్నాడు. తలవని తలంపుగా తరలి వచ్చిన మేనల్లుడిని చూసి కంగారుపడ్డా తమాయించుకొని తాను ఎలాంటి మాటా ఇవ్వలేదని అబద్ధం చెప్పాడు.

ఆగ్రహం చెందిన గోవిందుడు గ్రామంలోని పెద్దలను సంప్రదించాడు. వారు కూడా తాము ఏమీ చేయలేమని ఏదైనా సాక్ష్యం తెస్తే ఏదన్నా సహాయం చేయగలమని తెలిపారు.

సాక్ష్యం ఎవరున్నారు? సర్వేశ్వరుడు, వైకుంఠవాసుడు తప్ప! వారినే తేవడానికి వారణాశి వెళ్లాడు. ఇద్దరు దేవతలను సాక్ష్యం చెప్పడానికి వస్తారా? రాకపోతే తానిక్కడే బలవన్మరణం చెందడానికి సిద్ధం అని ప్రార్థించాడు.

ప్రియభక్తునికి సహాయం చేయడానికి నిర్ణయించుకొన్న లోకపాలకులు దర్శనమిచ్చి అతనిని స్వగ్రామానికి బయలుదేరమని, తాము వెనకే వస్తామని తెలిపారు. కానీ అతను మార్గమధ్యలో వెనుకకు తిరిగి చూస్తే తామక్కడే నిలిచిపోతామని షరతు విధించారు.

ఆది దేవతల అనుగ్రహం పొందడంతో ఆనందభరితుడైన గోవిందుడు తన ప్రయాణం ఆరంభించాడు. నేటి ఆలయమున్న ప్రాంతానికి చేరుకొనేటప్పటికి వెనక నుండి పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో ఏమవుతోంది? అన్న కుతూహలంతో గోవిందుడు వెనకకు చూసాడు. అంతే! సర్వేశ్వరుడు అక్కడే లింగరూపం దాల్చగా, నారాయణుడు కొద్ది దూరంలో శిలా రూపం ధరించారు.

ఇచ్చిన మాట మరచి కంగారులో చేసిన పనికి ఇంతటి శిక్షా? అని విలపించిన గోవిందుని ఓదార్చి–

వారు పంచాయితీ ఇక్కడే పెట్టుకొంటే తాము సాక్ష్యం చెబుతామని తెలిపారు.

విశ్వసించకపోయినా ఏం జరుగుతుందో అన్న కుతూహలంతో గ్రామం అంతా తరలివచ్చారు. ఈ లోపల తండ్రి మాట తప్పాడన్న విషయం తెలుసుకొన్న బాలిక దేవతలు సాక్ష్యమిచ్చినా ఇవ్వకపోయినా తాను గోవిందుని వివాహం చేసుకుంటానని తెలిపింది.

పంచాయితీలో అందరినీ అబ్బురప రుస్తూ లింగం నుండి, నారాయణ మూర్తి నుండి "పిల్లనిచ్చి పెళ్లి చేస్తానని మా ముందు వాగ్దానం చేసాడు" అన్న మాటలు వినిపించాయి.

పెద్దలంతా కలిసి గోవిందునికి ఆ కన్యతో వివాహం జరిపించారు. అలా భక్తునికి మద్దతు తెలపడానికి కాశీ నుండి తరలివచ్చి ఇక్కడ కొలువు తీరిన కైలాసనాథునికి గ్రామస్తులంతా కలిసి అత్రిమహర్షి ఆధ్వర్యంలో ఆలయం నిర్మించినట్లు తెలుస్తోంది. అనంతర కాలంలో స్థానిక పాలకులు ఆలయాభివృద్ధికి తమ వంతు కృషి చేసినట్లు శాసనాధారాలు తెలియజేస్తున్నాయి.

ఈ గాథ శ్రీ వ్యాసభగవానులు తమ కుమారుడైన శుక మహర్షికి తెలిపినట్లుగా పురాతన గ్రంథాలు పేర్కొంటున్నాయి.

తుంగభద్రా నదిని తనలో కలుపుకొని ప్రవహిస్తున్న బాలకృష్ణమ్మలో గంగాదేవి కూడా అంతర్వాహినిగా ప్రవహించడం వల్ల సంగమ తీరంలో కొలువు తీరిన స్వామిని శ్రీ సంగమేశ్వరుడు అని భక్తితో పిలుచుకోసాగారు.

ఈ కారణం వలన ఈ గ్రామానికి సంగం జాగర్లమూడి అన్న పేరు వచ్చింది. మరో సాక్షి అయిన శ్రీ భావ నారాయణ స్వామి సమీపంలోని నేటి పొన్నూరులో సాక్షి భావ నారాయణ స్వామిగా స్థిర నివాసమేర్పరచుకొన్నాడు.

సువిశాల ప్రాంగణానికి తూర్పు, పడమర, దక్షిణ దిశలలో గోపురాలుంటాయి. ప్రాంగణంలో ఎన్నో ఆలయాలుంటాయి. పడమర ద్వారానికి వెలుపల శ్రీ గంగాదేవి ఆలయం ఉంటుంది. బాలకృష్ణ పాయ మారుతున్న పడమర దిక్కుగా ఉన్న గోపురం ద్వారం గుండా లోపలికి ప్రవేశిస్తే ఆలయ వృక్షం జమ్మిచెట్టు మొదలు వద్ద ఉన్న ఎన్నో పురాతన విగ్రహాలు కనిపిస్తాయి. పక్కనే కాలభైరవ ఉపాలయం, పక్కనే నవగ్రహ మండపం, గోశాల కనిపిస్తాయి.

తూర్పు ముఖంగా ఉన్న ప్రధాన ఆలయంలో లింగ రూపంలో శ్రీ సంగమేశ్వర స్వామి భక్తుల సేవలను స్వీకరిస్తుంటారు. పక్కనే అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి కొలువై ఉంటారు.

ఆలయ విమానం మీద మరెక్కడా కనిపించని విధంగా దిక్పాలకుల విగ్రహాలను వాహనాలతో సహా మలచి నిలిపారు. అదీ ఇక్కడి విశేషం.

ప్రాంగణంలో కళ్యాణ మండపం, శ్రీ ఆంజనేయ, శ్రీ వీరభద్ర స్వామి ఉపాలయాలను దర్శించుకొన్న తరువాత దక్షిణ దిశగా వెళితే అక్కడ శ్రీ పార్వతీదేవి సమేత శ్రీ పాపవినాశేశ్వర

ఎందరో మహర్షులు, మహనీయులు సందర్శించి శ్రీ సంగమేశ్వర స్వామిని సేవించుకొన్నారని ప్రచారంలో ఉన్న గాథలు తెలుపుతున్నాయి. శ్రీ సంగమేశ్వర స్వామికి ఇతర దేవీ దేవతలకు నిత్య పూజలు నియమంగా నిర్వహిస్తారు.

అన్ని పర్వదినాల్లో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. ముఖ్యంగా శివరాత్రి, కార్తిక మాసంలో, పౌర్ణమి, అమావాస్య రోజులలో, ఆలయ ఉత్సవాల సందర్భంగా స్వామివారి కళ్యాణం, రథోత్సవం ఘనంగా జరుపుతారు. జిల్లా నుండే కాక రాష్ట్ర మంతటి నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.



స్వామివారి ఆలయం కనపడుతుంది. చాలా అరుదుగా ఒకే ప్రాంగణంలో సర్వేశ్వరుడు రెండు నామాలతో కొలువుతీరి దర్శనమివ్వడం జరుగుతుంది.

శ్రీ పాపవినాశేశ్వర స్వామి భక్తుల జన్మ జన్మల పాపాలను హరించి ఇహ పర సుఖాలను ప్రసాదిస్తారన్నది స్థానిక భక్తుల విశ్వాసం. మరో విశేషం వీరభద్ర స్వామికి విడిగా ధ్వజస్తంభం ఉండటం.

ప్రాంగణంలో వంటశాల, వాహనశాల, భక్తులు శుభకార్యాలు జరుపుకోడానికి కావలసిన ఏర్పాట్లతో పాటు భోజనశాల కూడా నిర్మించబడ్డాయి.

కాలవకు ఆవలి పక్క శ్రీ వెంకటేశ్వర స్వామివారి పురాతన ఆలయం ఉంది.

ఈ విధంగా సంగం జాగర్లమూడి హరిహర క్షేత్రంగా పేరొందింది. పురాణ కాలం నుండి భక్తులకు కొంగుబంగా రంగా పేర్కొనబడుతున్న ఈ క్షేత్రాన్ని

గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీ వినాయక, శ్రీ గోపయ్య స్వామి, శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, శ్రీ వెంకయ్యస్వామి, శ్రీ షిరిడీ సాయి మందిరాలు నెలకొల్పబడ్డాయి. అన్ని హిందూ పర్వదినాలలో అద్భుతమైన ఆధ్యాత్మిక వాతావరణం సంగం జాగర్లమూడిలో నెలకొని ఉంటుంది. ఎంతో విశేష పౌరాణిక నేపథ్యంగల సంగం జాగర్లమూడి గుంటూరు–తెనాలి పట్టణాల మధ్యలో నెలకొని ఉంది.

గుంటూరు నుండిగానీ తెనాలి నుండిగానీ సులభంగా ఇక్కడికి చేరుకోవచ్చు. గుంటూరు, తెనాలి పట్టణాల్లో వసతి సౌకర్యాలు లభిస్తాయి. తప్పనిసరిగా సందర్శించవలసిన క్షేత్రాలలో శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయం, సంగం జాగర్లమూడి ఒకటి.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



విందు-వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. విలువైన వస్తువులను సమకూర్చుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు వారాంతంలో పరిష్కారమయ్యే సూచనలున్నాయి. మిత్రులతో మనస్పర్థలకు ఆస్కారం. వారాంతంలో ఖర్చులు అధికంగా ఉంటాయి. మీ శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగులకు పదోన్నతి సూచనలున్నాయి.

## వృషభం



బంధు, మిత్రులతో వివాదాలకు అవకాశాలున్నాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి యథాతథంగా ఉంటుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. శుభ కార్యాల్లో పాల్గొంటారు. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతికూలతలున్నా పనులు పూర్తి.

## మిథునం



అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. రుణాలు చేయాల్సి వస్తుంది. వివాదాలకు దూరంగా వుంటే మంచిది. ఉద్యోగులకు స్థాన చలనం. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించడం మంచిది. విదేశీ ప్రయాణ సూచనలున్నాయి. క్రయ-విక్రయాలు లాభదాయకంగా ఉంటాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

## కర్కాటం



అకారణంగా మానసిక ఆందోళన చెందుతారు. వివాదాలకు దూరంగా ఉంటే అన్ని విధాలా మంచిది. వారాంతంలో కుటుంబ సమస్యలు తీరుతాయి. బంధుప్రీతి పెరుగుతుంది. ఉద్యోగులకు పదోన్నతి లభించే అవకాశాలు అధికం. స్త్రీల వల్ల సమస్యలు ఎదురయ్యే సూచనలున్నాయి. శుభ కార్యాల్లో పాల్గొంటారు. గృహ యోగం.

## సింహం



దేశ సంచారం చేస్తారు. ప్రారంభించిన పనుల్లో ఆటంకాలు ఎదురవుతాయి క్రయ-విక్రయాలు లాభదాయకంగా ఉంటాయి. స్త్రీల వల్ల సమస్యలు ఎదురవుతాయి. కంటి సమస్యలు ఉంటాయి. ఉద్యోగులకు ఉన్నతాధికారం లభిస్తుంది. ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉంటుంది. విలువైన వస్తువులు అమ్మాలన్న ఆలోచన చేస్తారు.

## కన్య



గృహ సౌఖ్యం. శారీరక, మానసిక వత్తిడికి లోనవుతారు. వారాంతంలో రుణాలు చేస్తారు. ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు సహనంతో వ్యవహరించడం మంచిది. వ్యాపారుల మధ్య పోటీ అధికం. ఉద్యోగాభివృద్ధి ఆశాజనకం. అనుకోని వార్తలు వింటారు. వృత్తి రంగాల్లో వున్నవారికి ఆర్థికంగా బాగుంటుంది. ధార్మిక చింతన అలవడుతుంది.

## తుల




క్రయ-విక్రయాలు లాభసాటిగా ఉంటాయి. రుణాలు తీర్చి ఊరట పొందుతారు. ఉద్యోగులకు స్థాన చలనం. శారీరక శ్రమ అధికం. శుభ కార్యాలకు హాజరవుతారు. వ్యాపారాభివృద్ధి సంతృప్తినిస్తుంది. ఉద్యోగులకు ఉన్నతాధికారుల ప్రశంసలు లభిస్తాయి. వృత్తి వ్యాపారస్తులకు ఆశాజనకంగా ఉంటుంది. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. దేశాంతర ప్రయాణం చేస్తారు. బంధువులను కలుసుకుంటారు.

## వృశ్చికం



ఆదాయానికి తగిన ఖర్చులుంటాయి. ముఖ్యమైన పనులు వారాంతంలో పూర్తి చేస్తారు. సమస్యలు మరింత జటిలమవుతాయి. శారీరక శ్రమ అధికం. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు సత్ఫలితాలనిస్తాయి. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. వృత్తివ్యాపారులకు ఆశించిన లాభాలు బాగుంటాయి. ఎదురు చూస్తున్న శుభ సమాచారం వారాంతంలో తెలుస్తుంది.

## ధనుస్సు



గృహ సౌఖ్యం. వాహన యోగం. ఆరోగ్యం కుదుట పడుతుంది. భాగస్వామ్య వ్యాపారులు విడిపోయే సూచనలున్నాయి. ఉద్యోగులకు ఆశించిన ఫలితాలుంటాయి. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. ప్రతికూలతలు ఎదురైనా ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేసి అందరి ప్రశంసలు పొందుతారు. బంధు, మిత్రులను కలుసుకుంటారు. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు.

## మకరం



దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. రుణాలు తీర్చడంలో ఇబ్బందులు ఉంటాయి. ఉద్యోగులకు ఆర్థికంగా బాగుంటుంది. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయులను కలుసుకుంటారు. విద్యార్థులకు విజయం.

## కుంభం



అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. భాగస్వామ్య వ్యవహారాలు సానుకూలంగా ఉంటాయి. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. స్వల్ప ధన లాభ సూచనలున్నాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి ఖర్చులు అధికంగా ఉంటాయి. శుభ కార్యాల్లో పాల్గొంటారు. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఆశించిన ఫలితాలనిస్తాయి.

## మీనం



ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. అనుకోని సంఘటనలు ఎదురైనా ధైర్యంతో ఎదుర్కొంటారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించడం అత్యవసరం. స్వల్ప ధన నష్ట సూచనలున్నాయి. వృథా కాలక్షేపం చేస్తారు. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. ఊహించని వార్తలు వింటారు.

# జలవాస్తు ప్రయోజనాలు




వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458


ప్రాణాధారం జలం. భగీరథ ప్రయత్నంలో గంగ ప్రవహించిన చోట 'భస్మరాసులు' సైతం ప్రాణం పోసుకున్నాయి. అంత పవిత్రమైనది, అంత శక్తివంతమైనది జలం. జలాన్ని ఏ విధంగా మలచుకుంటే ఏ విధమైన ఫలితాలొస్తాయో తెలుసుకుంటే మీ పరిసరాల జలవాస్తు ప్రయోజనాలను పొందవచ్చు.

## ఉమ్మడి పైకప్పు-ప్రవాహం



ఇళ్లకు ఉమ్మడి కప్పు ఉన్నప్పుడు ఇతరుల ఇళ్ల పైకప్పు మీద నుండి ప్రవహించే నీరు తమ ఇంటి పైకప్పు మీద నుండి ప్రవహిస్తున్నప్పుడు, 'జలప్రవాహ వాస్తుదోషం' కలుగుతుంది. ఈ దోషం 'కలహం' స్థితులను కలగచేసే అవకాశముంది.

If canopy or slab of a particular house can be at higher level than the one next to it, in such a case the flow of the waer from higher slab tends to flow to lower level. This called 'Jalaprava Vaasthudosham'. This might create an imbalance the harmonious force leading to 'quarrels'.

## ఈశాన్యం-నీటి ప్రవాహం




ఇంటి పైకప్పు ఈశాన్య దిక్కుకు పల్లంగా ఉండాలి. తమ ఇంటి పైకప్పు పైన నీరు ఈశాన్య దిక్కుకు ప్రవహించినట్లయితే ధన లాభం, సంతాన ప్రాప్తి కలగడంతో పాటు వ్యవహార దక్షత, సకల సౌఖ్యప్రాప్తి మొదలైన సత్ఫలితాలు ఉంటాయి.

North-East-Slab water

North-East slope terrace is accepted as per vasthu. If the flow of water on your slab is towards North-East the occupant will gain in terms of good monetary benefits, healthy pregnancy and promotes industrious attitudes.

## ఉత్తరం-నీటి ప్రవాహం




ఇంటి పైకప్పు ఉత్తరం దిశకు వాలుగా ఉన్నట్లయితే మంచి ఫలితాలుంటాయి. తమ ఇంటి పైకప్పు పైన నీరు ఉత్తర దిక్కుకు ప్రవహించినట్లయితే ధన లాభం, సౌఖ్యం మొదలైన సత్ఫలితాలు కలుగుతాయి.

North-Slab water

North slope terrace brings favourable results. If the flow of water on your slab is towards North the occupant will gain in terms of good monetary benefits, happiness.

## వాయవ్యం-నీటి ప్రవాహం

పైకప్పు వాయవ్య దిశకు పల్లంగా వుండకూడదు. ఇంటి పైకప్పు పైన నీరు వాయవ్య దిక్కుకు(ఉత్తర వాయవ్యం,



పశ్చిమ వాయవ్యం) ప్రవహించినట్లయితే పశునాశనం కలుగుతుంది. పెంపుడు జంతువులు, పెంపుడు పక్షులను కోల్పోయే ప్రమాదముంది.

North-West-Slab water

North-West slope terrace is not accepted as per vasthu. If the flow of water on your slab is towards North-West(North North-West and West North-West) the occupant will face problems like death of cattle, livestock and pets.

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com

# బిళ్వణి

సింగిల్ పేజీ కథ

"మామ్మా, బాబా గుడికి" తీసుకెళ్లమని రెండేళ్ల బిళ్వణి మారాం చేయసాగింది. "అబ్బబ్బా.. ఉండవే.. సాయంత్రమైతే చాలు, ఒకటే నస.." విసుక్కుంది అర్చన. "బాబా... బాబా.." ఏడుస్తూ నానమ్మ చుట్టూనే తిరుగుతోంది బిళ్వణి.

"నువ్వసలు ఒదిలిపెట్టవుగా.. పద.." పాపకు చెప్పులు తొడిగింది అర్చన. వాళ్లుంటున్న ఇంటి నుంచి శివాలయానికి మూడొందల మీటర్లు. పాపకు నడక అలవాటు చేయాలని బిళ్వణిని తీసుకుని రోజూ శివాలయానికి వెళ్లేది అర్చన. క్రమంగా బిళ్వణికది అలవాటుగా మారింది. సాయంత్రం ఐదు గంటలు గుడికి తీసుకెళ్లమని గుర్తు చేస్తుంది.

షూస్ లాంటి చెప్పులు తొడుక్కుంది బిళ్వణి. నానమ్మతో పాటుగా నడుస్తూ ఆమె చేతిని అటూ ఇటూ ఊపుతూ నడవసాగింది. ఐదు నిమిషాల్లో శివాలయానికి చేరుకున్నారు.

శివాలయంగా పేరు పడిన ఆ ప్రాంగణంలో శివుని ఆలయంతో పాటుగా బాబా సన్నిధి, ఆంజనేయస్వామి గుడి, నవగ్రహాలు కొలువై ఉన్నాయి. అక్కడికి వెళ్లగానే గబగబా బాబా మందిరం వద్దకెళ్లి మోకాళ్ల మీద నిలబడి, చేతులు రెండూ పైకెత్తి మొక్కింది బిళ్వణి. కొత్తగా చూసేవాళ్లు ఆశ్చర్యపోతే, రోజూ చూసేవాళ్లు ముచ్చట పడ్డారు.

ముద్దు ముద్దుగా చిన్న చిన్న పదాలు పలుకుతూ సంబరంగా ఆడుకుంటోంది బిళ్వణి. పక్కనే మెట్ల మీద కూర్చుంది అర్చన. పక్కనున్న వారితో మాటలు కలిపింది. ఇంతలో హఠాత్తుగా అరుపులు వినిపించాయి. కంగారుపడి బిళ్వణిని వెతికింది అర్చన. ఆమె ఊహించినదానికంటే భిన్నమైనది జరిగింది. కాళ్లనొప్పులతోనే పడుతూ లేస్తూ పాప దగ్గరికెళ్లింది. అక్కడున్న సిబ్బంది ఆమెపై అరవడం మొదలెట్టారు. ఆ అరుపులకు ఆలయం నుంచి వెలుపలకొచ్చారు పూజారి.

"ఏమైంది?" సిబ్బందినుద్దేశించి అడిగారు.

"ఇక్కడ చూడండి స్వామీ.. పాప ఒకటికి వెళ్లింది" విషయం చెప్పారు. పాప ఏడిపిస్తోందని హడావుడిలో డైపర్ వేయడం మర్చిపోయిన సంగతి అర్చనకు గుర్తుకొచ్చింది.

"ఇంతకుముందెప్పుడూ ఇలా జరగలేదండీ, మన్నించండి" చిన్నతనంగా అనిపించాదామెకు.

"ఇదేమన్నా పార్కా? రోజూ తీసుకొచ్చి ఆడిస్తున్నావు. ముందిక్కడ్నుంచి తీసుకెళ్లవమ్మా" కసురుకున్నారు సిబ్బంది. "మన్నించండి బాబూ, నేను కడిగేస్తానుండండి" ఉపక్రమించింది అర్చన.

"పవిత్రమైనదాన్ని అపవిత్రం చేయడం, ఆనక కడుగుతాననడం బాగా అలవాటైపోయింది, వెళ్లండమ్మా" సిబ్బందిలో చొరబడిన ఆవేశం విచక్షణను కోల్పోసాగింది.

బిళ్వణి అలా చేయడం వారికేమాత్రం నచ్చలేదు. నిజం చెప్పాలంటే రోజూ తీసుకొచ్చి ఆ ప్రాంగణంలో ఆడించడం వారికస్సలు ఇష్టంలేదు. గుడికి వచ్చామా, దణ్ణం పెట్టుకున్నామా, వీలైతే దక్షిణ ఇచ్చామా! అన్నట్లు ఉండాలేగానీ గుడి ప్రాంగణాన్ని ఇలా ఆటస్థలంగా మార్చేసుకోవడాన్ని సహించలేకపోతున్నారు.

"పర్వాలేదులేమ్మా, వీళ్లు శుభ్రం చేస్తారులే. మీరేం కంగారుపడకండి" ఆగమన్నట్లు సైగ చేశారు పూజారి.

ఆయనలా చేయడం సిబ్బందికి రుచించలేదు. "ఇంకెప్పుడూ పాపను తీసుకురాను స్వామీ" అవమాన భారంతో తిరుగు ప్రయాణమైంది ఆమె.

"మీరు పాపను రోజూ తీసుకురండి. మీకేం ఇబ్బంది కలగకుండా చూసుకుంటాం" అభయమిచ్చారు పూజారి.

ఆశ్చర్యపోయింది అర్చన. , పూజారి వరమిచ్చినా అక్కడున్న సిబ్బంది అనుమతించరేమో అనుకుంది. అంతలోనే అందర్నీ ఒకేలా చూడకూడదన్న వాస్తవం జ్ఞాపకమొచ్చి కృతజ్ఞతగా పూజారికి నమస్కరించింది.

"చల్లగా ఉండండి బాబు.." దీవిస్తూ బిళ్వణిని తీసుకుని వెనుదిరిగింది. ఆమె అలా వెళ్లగానే "మందలిస్తారనుకుంటే ఇలా చేసారేమిటి స్వామీ?" అసహనాన్ని గట్టిగా వ్యక్తం చేశారు సిబ్బంది.

పూజారి చిన్నగా నవ్వి "పిల్లలు దేవుడితో సమానం. ఆ శివయ్యే ఈ పాప రూపంలో వచ్చిన మనకు పరీక్ష పెట్టారు" అన్నారాయన.

అయోమయంగా చూశారు సిబ్బంది.

**పూజారి చిన్నగా నవ్వి "పిల్లలు దేవుడితో సమానం. ఆ శివయ్యే ఈ పాప రూపంలో వచ్చిన మనకు పరీక్ష పెట్టారు" అన్నారాయన. అయోమయంగా చూశారు సిబ్బంది.**

ఆయనే మాట్లాడటం కొనసాగించారు. "యువతరం భక్తిమార్గం వైపు అడుగులు వేయడం లేదని చాలామంది నిందలు వేస్తున్నారు. అలా కాకుండా ఉండాలంటే వారికి చిన్నప్పట్నుంచే దేవుడి సాన్నిధ్యాన్ని అందివ్వాలి. ఆమె అదే చేస్తోంది. దగ్గర్లోనే రెండు మూడు పార్కులున్నా బిళ్వణిని ఇక్కడికి తీసుకురావడానికి ఇదే కారణం" స్థూలంగా చెప్పారు పూజారి.

"ఇందులో శివయ్య పెట్టిన పరీక్ష ఏమిటో అంతుబట్టడం లేదు స్వామీ" అర్థంకాక అడిగారు సిబ్బంది.


"ఏ మతంలోనైనా భక్తులకవసరమయ్యే సదుపాయాలు అందుబాటులో ఉంటే వారి మనస్సు దైవభక్తిపైనే లగ్నమవుతుంది. అవి అందుబాట్లో లేనిచోట దేవుడే ఇలా వివిధ రూపాల్లో వచ్చి పరీక్షించి, విషయాన్ని చేరవేస్తాడు. ఆవేశపడకుండా ఆలోచిస్తే అంతరార్థం బోధపడుతుంది. అందుకనే నా బాత్రూం పక్కనే భక్తుల కోసం ఒక బాత్రూం కట్టించమని సెక్రటరీ గారికి నా మాటగా చెప్పండి" సూక్ష్మాన్ని వివరించారు పూజారి.


గడిచిన రోజున టీవీలో వైరల్ అయిన సంఘటన జ్ఞప్తికి వచ్చింది సిబ్బందికి. చివరి కార్తిక పౌర్ణమి రోజున ఒక గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు ఒక డయాబెటిక్ పేషెంట్. అకస్మాత్తుగా అతను యూరిన్‌కి వెళ్లాల్సి వచ్చింది. క్యూ లైన్ నుంచి బయటకొచ్చి చుట్టూ వెతికాడు. ఆ ఆలయంలో బాత్రూమ్స్ లేవని తెలిసింది. ప్రదక్షిణలు పూర్తి కాకుండా ప్రాంగణం దాటితే అరిష్టమని అలాగే బిగపట్టుకుని క్యూ లైన్లోకి వెళ్లాడు. ఆరోజు భక్తులు ఎక్కువగా ఉండడంతో క్యూ లైన్ చాలా నెమ్మదిగా కదులుతోంది. ఆయన కడుపులో హడావుడి మొదలైంది. తట్టుకోలేక క్యూ లైన్ నుంచి వచ్చేసి, కంగారుగా మెట్లు దిగుతుండగా తూలిపోయి పడిపోయాడు.


కాసేపటికి విషయం మీడియాకి పొక్కింది. వైరల్‌గా మారింది. అటువంటి సంఘటనలు ఏ గుడిలోనూ పునరావృతం కాకూడదని పూజారిగారు పరోక్షంగా చెప్పింది గ్రహించారు సిబ్బంది. అర్చన పట్ల ప్రవర్తనకు చింతించారు.

**- దొండపాటి కృష్ణ**

# ఈ వారం కా'ర్టూన్స్'


బిస్కట్ వేసాడు.. విశ్వాసం
చూపించా... దొంగని నాకేం తెల్సు...?!
Zakir..


నా బంగారమే బెటరన్నమాట..!!
Zakir...


వాడెవర్నీ 'పళ్లెత్తి' మాటా అన్లేదు..
అది 'కళ్లెత్తి' ఒకర్ని చూసిందీ లేదు..
కష్టపడి డాక్టర్లయ్యారు...!!
డా. కుమార్
పళ్ల డాక్టర్
డా. కుమారి
కళ్ళ డాక్టర్

ఫోటో ఫీచర్



మాల్టాలోని ఈ గ్రామాన్ని 'పోపాయి విలేజ్' అని పిలుస్తారు. 'స్వీట్ హెవెన్' అని దీనికి మరో పేరు. ఓ సినిమా కోసం నిర్మించిన ఈ గ్రామాన్ని(సెట్టింగ్) సినిమా పూర్తయిన తరువాత టూరిస్ట్ ప్రాంతంగా మార్చారు. కాలక్రమంలో టూరిస్ట్ విలేజ్‌గా ఎంతో ప్రసిద్ధి గాంచింది.

